Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 10 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 ఫిబ్రవరి 2024 శనివారం పేజీలు : 4

## రికార్డు స్థాయిలో అయోధ్య హుండీ ఆదాయం

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రాములవారి గుడికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయంతో శ్రీ రాముడు పోటీ పడుతున్నాడని భక్తులు అంటున్నారు. జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాములవారి ప్రాణ ప్రతిష్ఠ జరగ్గా.. గడిచిన 10 రోజుల్లో వచ్చిన ఆదాయం రికార్డు నెలకొల్పింది. గత నెల 22 నుంచి ఫిబ్రవరి 1 వరకు 25 లక్షల మంది భక్తులు రామచంద్రుడిని దర్శించుకున్నట్లు అయోధ్య రామ జన్మ భూమి ట్రస్ట్ తెలిపింది. ఆలయానికి ఇప్పటివరకు రూ.11 కోట్లకుపైగా విరాళాలు సమకూరాయని ట్రస్ట్ వెల్లడించింది. హుండీల్లో రూ.8 కోట్లు, చెక్కులు, ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా రూ.3 కోట్ల 50 లక్షలు విరాళాలు వచ్చాయన్నారు.

# ఆదివాసీ బిడ్డలను అండగా...

## ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటాం




## ఇంద్రవెల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ

ఇంద్రవెల్లి: మూడు నెలల్లో భారాస అధినేత కేసీఆర్ సీఎం అవుతారని కొందరు అంటున్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే దమ్ము ఎవరికీ లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలను నట్టేట ముంచిన కేసీఆర్‌కు ముఖ్యమంత్రి పదవి కాదు కదా.. మంత్రి పదవి కూడా రాదన్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన 'తెలంగాణ పునర్నిర్మాణ సభ'లో రేవంత్‌రెడ్డి పాల్గొని సమర శంఖం పూరించారు. "ఇంద్రవెల్లి మట్టికి గొప్పదనం ఉంది. ఇక్కడ వేసే ప్రతి అడుగులో పోరాట పటిమ ఉంది. చరిత్ర పుటలో పౌరుషం గురించి చర్చించాలంటే రాంజీగోండ్ గురించి ప్రస్తావించాలి. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్నాం. అమరవీరుల స్తూపం సాక్షిగా కేసీఆర్ పాలనను అంతం చేశాం. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం. గూడేలకు రోడ్లు, నాగోబా ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించాం. ఆదివాసీ ప్రాంతాన్ని అభివృద్ధి వైపు నడిపించే బాధ్యత తీసుకుంటాం.

**ఇంద్రవెల్లి దారుణంపై ఆనాడే క్షమాపణ చెప్పా..** 1981లో కాంగ్రెస్ వాళ్లే ఇంద్రవెల్లిలో అడవి బిడ్డలను పొట్టనపెట్టుకున్నారని కొందరు విమర్శించారు. ఇంద్రవెల్లి దారుణంపై నేను ఆనాడే క్షమాపణ చెప్పా. సీమాంధ్ర పాలకుల హయాంలో ఆ తప్పు జరిగింది. అప్పుడు జరిగిన తప్పులు సరిచేసేందుకే సోనియా తెలంగాణ ఇచ్చారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను విధ్వంస రాష్ట్రంగా మార్చారు. భారాస ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు తెచ్చింది. కేసీఆర్ కుటుంబం కోసమే రాష్ట్రం వచ్చిందా? పదేళ్లలో ఏనాడైనా ఇంద్రవెల్లి అడవిబిడ్డల గురించి ఆలోచించారా? సమస్యల పరిష్కారం కోసం ప్రజాగాయకుడు గద్దర్ ప్రగతి భవన్‌కు వెళ్తే గేటు బయట నిలబెట్టారు. కేసీఆర్‌కు గద్దర్ ఉసురు తగిలింది. కోటి ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పి రూ.వేలకోట్లు దోచుకున్నారు.

**15 రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తాం..** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాలేదు.. అప్పుడే భారాస నేతలు శాపనార్థాలు పెడుతున్నారు. కేసీఆర్ పదేళ్లలో ఏమీ చేయలేదు.. మేము 2 నెలల్లో ఎలా చేయగలం? 15 రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత మంత్రివర్గం తీసుకుంటుందని హామీ ఇస్తున్నా. త్వరలో రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రియాంక గాంధీ ప్రారంభిస్తారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్నీ అమలు చేస్తాం. రాష్ట్రంలో 2లక్షల పోస్టులు భర్తీ చేసే బాధ్యత మాది. ఇప్పటికే 7వేల ఉద్యోగాలు ఇచ్చాం. తెలంగాణ ఎవరి చేతుల్లో భద్రంగా ఉంటుందో, ఎవరు అభివృద్ధి పథంలో నడిపిస్తారో ప్రజలు ఆలోచించాలి. ఈ దేశంలో ఉన్నది రెండే కూటములు.. ఒకటి ఎన్డీఏ, రెండోది ఇండియా కూటమి. భారాస ఎంపీలు గెలిస్తే మోదీ దగ్గర తాకట్టుపెట్టి కేసీఆర్ గులాంగిరి చేస్తారు.

రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి" అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# అక్కడ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీలలట..!



హైదరాబాద్, ఫిబ్రవరి 2: కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. అయితే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెక్ పెట్టాలన్నారు. కృష్ణా గోదావరి జీవ నదులని.. కృష్ణాలో తెలంగాణ వాటాను కేంద్రం తేల్చలేదన్నారు. తెలంగాణ వాటా చెప్పకుండానే ఆ బోర్డుకు రాష్ట్ర కృష్ణా జలాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. మల్లారెడ్డితో పోటీ పడే పరిస్థితి ఎవరికీ లేదన్నారు. ప్రజల కోసం పని చేసే నాయకుడు మల్లారెడ్డి అని చెప్పుకొచ్చారు. 420 హామీలు ఇచ్చిన రేవంత్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారని మండిపడ్డారు. "2 లక్షలు లోన్ తీసుకోమన్నారు, నేను మాఫీ చేస్తా అన్నారు.. ఎటుపోయింది? కోటి 57 లక్షల మంది ఆడ బిడ్డలు రూ.2500 కోసం వేచి చూస్తున్నారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్ల కడుపుకొట్టారు. ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని, 420 హామీలు తర్వాత అమలు చేస్తా అన్నారు. రేవంత్ లాంటి వాళ్ళను చాలా మందిని చూసాం. ఎంతో మంది తిస్మార్ ఖాన్‌లను మాయం చేసి తెలంగాణ తెచ్చారు కేసీఆర్. ఎవరికి అన్యాయం జరిగిన అందరం బస్ వేసుకొని వస్తాం. మన బాస్‌లు ఢిల్లీ, గుజరాత్‌లలో లేరు. తెలంగాణ మాట ఢిల్లీలో వినబడాలి అంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి" అని మాజీ మంత్రి కోరారు.

**అక్కడ లంకెబిందెలుండవ్...** లంకెబిందెల కోసం వెతికే వారు అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. సెక్రటేరియట్‌లో కంప్యూటర్‌లు, పేపర్లు ఉంటాయని లంకెబిందెలు ఉండవని ఎద్దేవా చేశారు. ప్రజల తరుపున పోరాడుతామని, ప్రతి హామీని వారు నెరవేర్చే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక వచ్చినా గులాబీ జెండాకు ఓటు వేస్తేనే మన గొంతుక ఉంటదని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్..?




హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ సమావేశాలు ఫిబ్రవరి 15న ప్రారంభం కానున్నట్లు తెలిసింది. సభ ఎన్ని రోజులు జరగాలనేది బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశం తర్వాత నిర్ణయిస్తారు. కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రం కూడా అటు వైపే మొగ్గు చూపనున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 15 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని సమాచారం. ఈ సమావేశాల్లో భాగంగా పూర్తిస్థాయి బడ్జెట్ పెడతారా? ఓటాన్ అకౌంట్‌కు వెళతారా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. వాస్తవానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏ మేరకు నిధులు వస్తాయన్న అంచనాలతోనే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్‌ఎయిడ్‌తో పాటు పలు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు (సీఎస్ఎస్) నిధుల కేటాయింపులను అంచనా వేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను పేర్కొంటూ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అయితే కేంద్రం పెట్టిన ఓటాన్ అకౌంట్‌లో ప్రజలపై విధించే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానంలో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు కానీ, రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయంలో విధాన నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీంతో అసలు కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తాయన్న దానిపై రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా అంచనాకు వచ్చే అవకాశం లేదని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ వైపే మొగ్గు చూపుతుందని అంటున్నారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా 2019-20 ఆర్థిక సంవత్సరంలోనూ కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. తెలంగాణలో కూడా ఆరు నెలల కాలానికి గాను ఓటాన్ అకౌంట్ పెట్టి ఆ తర్వాత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.




## ఇచ్చిన మాట ప్రకారం

# హామీల అమలుకు... ఆచితూచి అడుగులు...!

## మరో రెండు గ్యారెంటీల అమలుకు ముహూర్తం ఫిక్స్..!

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు గ్యారెంటీలను అమలు చేయాలని కసరత్తు మొదలు పెట్టింది. రూ.500కు వంట గ్యాస్, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్‌లను ఇంప్లిమెంట్ చేయాలని ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఈ రెండు గ్యారెంటీలను అమలు చేసేందుకు సన్నద్ధం కావాలని సీఎం రేవంత్ ఇప్పటికే ఆయా శాఖలకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. మహాలక్ష్మి గ్యారెం టీలోని మూడు అంశాల్లో ఒకటైన రూ.500 లకే గ్యాస్ సిలిండర్‌ను, గృహజ్యోతిలోని ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందజేయనున్నారు. సర్కార్ ఆదేశాలతో సివిల్ సప్లై శాఖ, విద్యుత్ శాఖలు ఈ రెండు హామీల అమలుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. లబ్ధిదారులను ఎలా ఎంపిక చేయాలి..? ఎవరెవరికి సబ్సిడీ గ్యాస్ అందించాలి..? సెంట్రల్ గవర్నమెంట్ అందజేసే ఉజ్వల్ సిలిండర్లు ఎంత మందికి అందుతున్నాయి..? వంటి వివరాలను సివిల్ సప్లై శాఖ తరువుగా అధ్యయనం చేస్తోన్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి రెండు రోజుల్లో రూ.500 లకే గ్యాస్ సిలిండర్ హామీ అమలుపై ఓ నివేదికను కూడా అందజేస్తామని ఓ అధికారి తెలిపారు. ఉచిత విద్యుత్‌తో ఎంత ఖర్చు వెచ్చించాల్సి ఉంటుంది..? ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్లాలి? అర్హులను ఎలా గుర్తించాలనే దానిపై కూడా విద్యుత్ శాఖ రిపోర్టు తయారు చేస్తున్నట్లు తెలిసింది.

**వంద రోజుల్లోనే పూర్తి చేయాలని..** ప్రజలకు హామీ ఇచ్చినట్లే వంద రోజుల్లో ఆరు గ్యారెటీలను అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. దీనిలో భాగంగా ఫిబ్రవరి నెలలో గ్యాస్, ఉచిత పవర్‌ను ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

దీంతో గృహజ్యోతి గ్యారెంటీ సంపూర్ణంగా పూర్తి కానుండగా, మహాలక్ష్మి గ్యారెంటీలో రెండు అంశాలు క్లియర్ అవుతాయి. మహిళలకు ప్రతి నెలా రూ.2500 అంశాన్ని అమలు చేస్తే ఆ గ్యారెంటీ కూడా పూర్తిగా అమల్లోకి వస్తుంది. ఫిబ్రవరిలో అమలు చేయబోతున్న ఈ రెండు హామీల తర్వాత లిస్టులో ప్రతి నెలా రూ.2500 ఆర్థిక సాయమే ఉంటుందని కాంగ్రెస్ పార్టీలోని ఓ నేత తెలిపారు. మరో 50 రోజులు పూర్తయ్యే లోపు మిగతా గ్యారెంటీలన్నీ అమలవుతాయని కాంగ్రెస్ లీడర్లు స్పష్టం చేస్తున్నారు.

**బడ్జెట్ అడ్జెస్ట్ చేస్తూ..** గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల్లోకి నెట్టేసిందని, ఏకంగా రూ. ఆరు లక్షల కోట్లు ముంచిందని చెబుతున్న కాంగ్రెస్, ఆర్థిక నష్టాన్ని పూడ్చే చర్యలను చేపట్టింది. సెంట్రల్ గవర్నమెంట్‌తో పాటు ఆర్బీఐ, వివిధ సంస్థల సహకారంతో ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ ముందుకు వెళ్తున్నది. ఆరు గ్యారెంటీల అమలు కోసం విడతల వారీగా బడ్జెట్‌ను సమకూర్చుతూ ముందుకు సాగుతున్నది. ఫిబ్రవరిలో అమలు చేయబోయే రెండు హామీలకు అవసరమైన నిధులు సమకూరాయని, అందుకే వెంటనే ఇంప్లిమెంట్ చేసేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయని ఆఫీసర్లు కూడా చెబుతున్నారు. ఈ రెండు అంశాల అమలుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందనున్నదని ఓ అధికారి ఆఫ్?ది రికార్డులో చెప్పారు.

**ప్రజాపాలన అప్లికేషన్ల నుంచి మొదలు..** ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన అప్లికేషన్ల నుంచి ఫస్ట్ రౌండ్‌లోని అర్హులను గుర్తించనున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో ఈ రెండు స్కీమ్‌ల కోసం ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే అప్లికేషన్ల డేటా ఎంట్రీ చివరి దశకు రాగా, స్కీమ్‌ల అర్హతను గుర్తించేందుకు రెండు మూడు రోజుల్లో మార్గదర్శకాలు కూడా ఫైనల్ కానున్నాయి. వాటిని అనుసరించి అప్లికేషన్లను ఫిల్టర్ చేసి అర్హులను ఎంపిక చేయనున్నారు. గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ రెండూ హామీలూ మహిళల పేర్ల మీదనే ఇవ్వనున్నారు.

# సంపాదకీయం

## ఫస్ట్ టైమ్: ఈడీపై కేసు పెట్టిన ముఖ్యమంత్రి ఎక్కడ? ఎందుకు?

కేంద్ర దర్యాప్తు సంస్థ.. పైగా స్వతంత్రంగా వ్యవహరించే సంస్థగా రాజ్యాంగంలోనే చోటు కల్పించిన ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇప్పుడు చిక్కుల్లో పడింది. ఈడీ దూకుడుకు కళ్లెం వేస్తూ.. ఏకంగా ముఖ్యమంత్రి ఈ సంస్థ అధికారులపై కేసులు పెట్టారు. దీంతో ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దేశంలో ఇప్పటి వరకు సీబీఐ అధికారులపై పశ్చిమ బెంగాల్,ఏపీ తదితర రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. కానీ, ఇప్పటి వరకు ఈడీపై ఏ రాష్ట్రంలోనూ కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

**ఎక్కడ..** గనుల రాష్ట్రంగా పేరొందిన.. జారండ్‌లో అక్కడి ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌పై ఈడీ అధికారులు భూ కుంభకోణం సహా.. మనీ లాండరింగ్ కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆయనకు నోటీసులు జారీ చేయడం.. వాటిని ఆయన పట్టించుకోక పోవడం తెలిసిందే. ఇప్పటికి నాలుగు సార్లు ఆయనకు నోటీసులు జారీచేసినా.. ఆయన పలు కారణాలతో వాటి నుంచి తప్పించుకున్నా రు. ఇక, ఈ క్రమంలో తాజాగా ఆయనను ఢిల్లీలో విచారిస్తున్నారు. ఆయనను ఏ క్షణంలో అయినా అరెస్టు చేసే అవకాశం ఉందని ఒకవైపు వార్తలు వస్తున్నాయి. మరోవైపు.. ప్రభుత్వ బాధ్యతలను ఆయన సతీమణి కల్పనకు ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఇది లావుంటే.. తనను ఈడీ విచారించడం.. తనను గాలించడం వంటి చర్యలపై ఈడీ అధికారులపై ముఖ్యమంత్రి హేమంత్ పోలీసు కేసు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు కోరుతూ.. ఆయన రాష్ట్ర రాజధాని రాంచీలో ఉన్న ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. నిజానికి ఈడీ అధికారులపై కేసులు నమోదు చేసినా.. దీనికి న్యాయ స్థానం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై పోలీసులు కూడా.. న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్టు సమాచారం.

**రాజకీయ దుమారం..** సీఎం హేమంత్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించడం.. ఆయనను విచారణకురావాలని వెంటపడడం వెనుక కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు ఉందని జేఎంఎం నాయకులు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేశారు. కేంద్రం ఆదేశాల మేరకే ముఖ్యమంత్రి సొరెన్‌ను ఈడీ అధికారులు వేధిస్తున్నారని నాయకులు వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలను చూస్తూ ఊరుకోబోమని కూడా వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు.. ఉద్దేశ పూర్వకంగానే బీజేపీని వ్యతిరేకించే వారిపై ఈడీ, సీబీఐ అధికారులను ఉసిగొల్పుతున్నారని వ్యాఖ్యానించారు. దీంతో హేమంత్ వ్యవహారం.. రాజకీయంగా కూడా సెగలు పుట్టిస్తోంది.

# ఉద్విగ్న క్షణాలకు వేదికైనా అలియాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయం









శామీర్ పేట (గరుడ వార్త) : ఓటు వేసి ఐదేళ్లపాటు అలియాబాద్ గ్రామానికి సేవ చేసే అవకాశం కల్పించిన గ్రామస్తులు అందరికీ ఐదేళ్లపాటు పాలనను అందించిన పంచాయతీ పాలక సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. పదవీకాలం ముగియడంతో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించి నూతన వస్త్రాలు బహుకరించారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం వేదికగా ఐదు సంవత్సరాల పాటు ప్రజా ప్రతినిధులుగా వారి వీధులు నిర్వహించిన సర్పంచ్ గురుక కుమార్, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి తో పాటుగా వార్డ్ సభ్యులకు గౌరవ సన్మానం చేశారు. ఇక సర్పంచ్ గురక కుమార్, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డిలు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి సన్మానించారు. దాంతోపాటుగా గ్రామపంచాయతీ సిబ్బందికి సన్మానం చేసి వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా తమకు ఓటు వేసి గ్రామ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన అలియాబాద్ గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఐదు సంవత్సరాల పాటు కలిసి ప్రజాసేవలో పాల్గొన్నామని గుర్తు చేసుకున్నారు. అందుకు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది అందరూ సహకరించారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వార్డ్ సభ్యులు కనకాల లింగం, తమటం రేణుక, పల్లపు లావణ్య, పడిగా కిషోర్, పల్లె వాణి, కంచుగట్ల గోపాల్, ముద్దం సుధాకర్ రెడ్డి, గూదే వాణి, సంఘమైన పద్మ, బోయిని నాగరాజు, తూము కావ్య, బండి రాంరెడ్డి, కారోబార్లు సుధాకర్, నర్సోత్తమ్ రెడ్డి, కల్పన, అనిల్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ అరుణ్ తో పాటుగా రాములు, ముత్యాలు, సత్తయ్య, నవనీత తదితర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# హెూటల్ లియోనియాలో జార్ఖండ్ ఎమ్మెల్యేల బస...

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలతో కలిసి యూనియన్ చేరుకున్నారు...**

**ముందుగా లియోనియాలో ఏర్పాట్లను సమకూర్చిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు...**






శామీర్ పేట, (గరుడ వార్త) : ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు షామీర్పేట్ లోని లియోనియా రిసార్ట్ కు చేరుకోవడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయనే చెప్పాలి. లియోనియా రిసార్ట్స్ లో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఎమ్మెల్యేలను లియోనియాకు తరలించారు. ముందుగా లియోనియాకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విచ్చేసి ఎమ్మెల్యేల క్యాంపు ఏర్పాట్లను సమకూర్చినట్లుగా సమాచారం. అనంతరం రెండు బస్సులలో ఝూర?ండ్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 43 మందిని భారీ బందోబస్తు మధ్య క్యాంపుకు తరలించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ క్యాంపులో ఈనెల 5వ తేదీ ఉదయం 7 గంటల వరకు ఉండనున్నారు.

# మండల అభివృద్ధిపై సభ్యులతో బడ్జెట్ సమావేశం

శామీర్ పేట (గరుడ వార్త) : మండల అభివృద్ధియే ధ్యేయం గా ముందుకు సాగుతామని ఎంపీపీ హారిక మురళి గౌడ్ అన్నారు. శుక్రవారం మూడు చింతలపల్లి మండలంలో మండల ప్రాదేశిక సభ్యుల తో ఎంపీపీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధిలో భాగంగా బడ్జెట్ పై సమావేశం లో ఎంపీడీవో వస్తదా దేవితో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి ఆదర్శంగారావాలని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతున్నానని తెలిపారు. ఈ బడ్జెట్లో గ్రామాలలోని డ్రైనేజీలు, సిసి రోడ్లపై నిధుల కేటాయింపు పై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.



# పేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుండాలి...

**ఎంపిటిసిలపోరం అధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డి**

శామీర్ పేటప, (గరుడ వార్త) : ప్రతి ఒక్కరు పేదలను ఆదుకోవడంలో ముందుండాలని ఎంపిటిసిలపోరం అధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డి కోరారు. శుక్రవారం కేశవరంలోనీ గ్యార ఉద్విక, హాసిని లకు సుకన్య సమృద్ధి ఖాతాను తెరిపించి వారి ఖాతాల్లో రూ. 6500 జమ చేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తోచిన సహాయం చేయాలని, సహాయం చేస్తే ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. గత సంవత్సరం నుంచి కేశవరం గ్రామంలోని 10 సంవత్సరాలలోపు పేద బాలికలకు తన ఎంపీటీసీ గౌరవ వేతనాన్ని పోస్ట్ ఆఫీస్ లో జమ చేస్తున్నానని తెలిపారు. ఇలానే ప్రతి ఒక్కరూ తోచిన కాడికి పేద బాలికలకు సహకారం అందిస్తే ఎంతో బాగుంటుందని కోరారు.

# చెరువులకు హద్దులేవి?

మిర్యాలగూడ : గతంలో తెలంగాణ ప్రాంతంలో తవ్విన చెరువులకు సరిహద్దులు నిర్ణయించే విషయంలో 60 ఏళ్లకు పైగా జరుగుతున్న జాప్యంతో.... ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో చెరువులు ఆక్రమణకు గురై.. ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్న తరహా వ్యవసాయానికి అనువుగా ఉన్న చెరువులు 556 ఉండగా , పంచాయతీరాజ్ పరిధిలో 4193 ఉన్నాయి. మొత్తం 4749 చెరువుల పరిధిలో 218945 ఎకరాల విస్తీర్ణంలో సమీప రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. 2016లో మిషన్ కాకతీయ పథకం కింద జిల్లాలోని చెరువులలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగేలా పూడికతీత పనులు చేపట్టారు. ఈ సమయంలో రికార్డుల ప్రకారం చెరువుల సరిహద్దులు గుర్తించి ఆక్రమణలు ఉంటే తొలగించి ఎఫ్‌టీఎల్( నీటి నిల్వ సామర్థ్యం) మేర నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు దశల్లో మిషన్ కాకతీయ పనులు చేపట్టినప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే ఆక్రమణలు తొలగించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించిన హద్దులను కొందరు ఇప్పటికే తొలగించి తిరిగి పంటలు సాగు చేస్తున్నారు.

రాజకీయ కారణాలతో గ్రామాల్లో ఆక్రమణలను రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల విభాగాల అధికారులు తొలగించలేని పరిస్థితి ఉండగా ఇప్పటికే పలు చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఉ



మ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 4749 చెరువుల్లో 90 శాతానికి పైగా చెరువులకు సరిహద్దులు గుర్తించలేదని నీటిపారుదల అధికారుల లెక్కలు చెబుతుండగా పరిస్థితి తీవ్రతను అర్థంచేసుకోవచ్చు.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే చర్యలు**

**అజయ్‌కుమార్, నీటిపారుదల శాఖ సీఈ**

చెరువుల ఎఫ్‌టీఎల్ సామర్థ్యం గుర్తించే విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే నిర్ణీత విధానంలో సరిహద్దులు గుర్తిస్తాం. రికార్డుల ప్రకారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి నిర్ణీత హద్దులు ఏర్పాటు చేస్తాం.

**ఆక్రమణలు మచ్చుకు కొన్ని...**

మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద చెరువుకు రూ.9 కోట్లతో మినీట్యాంకు బండ్ నిర్మాణం జరపాలని 2016లో నిధులు విడుదల కాగా ఇప్పటి వరకు సరిహద్దు సమస్యతో పనులుఅసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని చెరువును కొందరు వ్యక్తులు ఆక్రమించుకోగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల సరిహద్దుప్రాంతంలోని రైతులు ముందుకు జరుగుతూ పంటలు సాగు చేస్తుండగా కొన్ని చోట్ల గతంలో రెవెన్యూ సిబ్బంది పట్టాలు సైతం ఇవ్వటంతో ప్రస్తుతం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువుల సరిహద్దులు నిర్ణయించి ఆనవాళ్లు కోల్పోకుండా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

# పేదలవి కూల్చేద్దాం.. మనం కట్టేద్దాం

హైదరాబాద్: చట్టం అమలులో సామాన్యులకు ఒకలా.. తమకు మరోలా అన్నట్లుగా జీహెచ్ఎంసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్‌లో సోమవారం పేదల ఇళ్లను జీహెచ్ఎంసీ కూల్చివేసింది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో మరో 49 అక్రమ నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. అదే జీహెచ్ఎంసీలో పనిచేస్తోన్న కొందరు అధికారులు, రాష్ట్రంలోని వేర్వేరు స్థానిక సంస్థలు, ప్రభుత్వ శాఖల్లోని గెజిటెడ్ ఉద్యోగులు చేపడుతోన్న అక్రమ నిర్మాణాలు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గచ్చిబౌలిలోని టీఎన్‌జీవో కాలనీ, తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఒక్కసారి కూడా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మనం మనం సర్కారు ఉద్యోగులం..

రాష్ట్ర ప్రభుత్వం గచ్చిబౌలిలో 158 ఎకరాల భూమిని టీఎన్‌జీవోలకు కేటాయించింది. మొదటి దశ కింద ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్



అయ్యాయి. రెండో టీఎన్‌జీవో లేఔట్‌లో ఒక్కో ఇంటి స్థలం విస్తీర్ణం 167 గజాలు. రోడ్ల వెడల్పు 40 అడుగులు, 60 అడుగులుగా ఉంటుంది. అంతా ప్రణాళిక ప్రకారం ఉన్నప్పటికీ.. భూ వివాదం కారణంగా లేఔట్‌లోని ఏ ఇంటికీ అధికారికంగా అనుమతి లభించదు. కానీ.. నిర్మాణాలు ఆగట్లేదు. మనం మనం సర్కారు ఉద్యోగులం అంటూ.. జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు, టీఎన్‌జీవో కాలనీలోని అధికారులు ఒక్కటయ్యారు. సొసైటీ నుంచి అనుమతి తీసుకున్నామంటూ.. ప్లాట్ల యజమానులు అంతస్తులకు తగ్గకుండా భవనాలు నిర్మిస్తున్నారు. వీటిని చేపడుతోన్న వారిలో.. కొందరు జీహెచ్ఎంసీలో పనిచేస్తోన్న అధికారులూ ఉన్నారు. ఒకటి లేదా రెండంతస్తులు కట్టుకునేందుకు సొసైటీ అనుమతిస్తుండగా.. చాలా మంది అద్దెల కోసం అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారు. బీఎన్ఆర్ హిల్స్, జర్నలిస్టు కాలనీ, ప్రశాసన్‌నగర్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్‌లోని వెంకటగిరిహిల్స్, గాయత్రిహిల్స్ ప్రాంతాల్లో వందలాది అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ప్రణాళిక విభాగం చోద్యం చూస్తోందనే విమర్శలున్నాయి.

పని తీరు పడకేసింది..

ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై వచ్చే ఫిర్యాదులది మొదటిస్థానం. జోనల్ స్థాయిలోని టాస్క్‌ఫోర్స్ బృందాల పనితీరు, న్యాక్ ఇంజినీర్ల పనితీరు పడకేసిందని, ఆ విషయమై సమీక్షించి కఠిన చర్యలు తీసుకుంటామని యంత్రాంగం చెబుతోంది.

# మార్కెట్ల బలోపేతమే సమస్యలకు విరుగుడు

జగిత్యాల : రైతులు పండించిన ఉత్పత్తుల విక్రయాలు జోరందుకోగా జిల్లాలోని మార్కెట్ యార్డుల బలోపేతం, ప్రభుత్వ సేకరణ కేంద్రాల ఏర్పాటుతోనే ఉత్పత్తుల విక్రయ సమస్యలు తీరి రైతులకు లబ్ధికలుగుతుంది. జిల్లాలోని 13 యార్డుల్లో 48 మంది సిబ్బందికి పది మంది మాత్రమే ఉండటం.. కొందరు ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులు విధుల్లో ఉండటం క్రయవిక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. యార్డుల్లోని క్రయవిక్రయాలతో పాటుగా 412 గ్రామీణ సేకరణ కేంద్రాల ఆజమాయిషీ, చెక్‌పోస్టులు, పశువుల వారసంతలు, పండ్ల మార్కెట్, మిల్‌పాయింట్ల చెక్‌పోస్టుల ద్వారా యార్డులకు ఆదాయం సమకూరుతున్నా సిబ్బందిలేమి తీవ్రంగా వేధిస్తోంది నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీచేయాలి.



ఇలా చేస్తే మేలు..

జిల్లాలోని యార్డులకు సాలీనా రూ.26 కోట్లకుపైగా మార్కెట్ ఫీజు వస్తున్నా ఈ దిశగా యార్డుల్లో సదుపాయాలు కల్పించటం లేదు. ఇ-నామ్ పరిధిలోని జగిత్యాల, మెట్పల్లి, గొల్లపల్లి యార్డులను రాష్ట్రంలోని, దేశంలలోని అన్ని ఇ-నామ్ యార్డులతో అనుసంధానిస్తే మన రైతుల ఉత్పత్తులను ఇతర ప్రాంతాల వ్యాపారులు కొనే వీలుంటుంది. తద్వారా మామిడి, పసుపు, పత్తి, మక్కలు, ఆవాలు, నువ్వులు, మిరప, సన్నధాన్యం, జొన్నలు తదితరాలను పండించిన రైతులకు అధిక ధరలు చేతికందుతాయి.

జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల తదితర కొన్ని యార్డుల్లోనే సేకరణ జరుగుతుండగా మిగిలిన యార్డులు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. యార్డులకు పాలకమండళ్లను నియమిస్తున్నా సదుపాయాలు, కొనుగోళ్లులేక కొన్ని నామమాత్రంగా మారాయి. ఈ నేపథ్యంలో అన్ని యార్డుల్లోనూ సదుపాయాలు కల్పించి, సిబ్బందిని నియమించి కొనుగోళ్లను ప్రారంభిస్తే రైతులకు ఊరట కలుగుతుంది. సారంగాపూర్, బీర్‌పూర్, బుగ్గారం, కొడిమ్యాల తదితర మండలాల్లోనూ యార్డులను ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వ సేకరణ లేకుంటే రైతులకు దళారులే దిక్కుగా మారుతున్నందున 4 సీసీఐ పత్తి, 10 మార్క్‌ఫెడ్ మక్కలు, 4 మార్క్‌ఫెడ్ కందుల కేంద్రాలను ఏర్పరచాలి. ఇప్పటికే పత్తి, మక్కలు, పసుపు, నువ్వులు, మిరప, సన్నధాన్యం, జొన్నలు, ఆవాలు, మామిడి తదితరాలు చాలావరకు పల్లెల్లోనే మధ్యవర్తులు కొనుగోలు చేస్తుండగా తూకంలో మోసాలు, డబ్బుల ఎగవేత జరగకుండా చూడాలి. మరోవైపు ప్రైవేటు వ్యక్తులు కూడా లైసెన్స్ తీసుకుని తమ స్థలాల్లో కొనుగోలు చేసే వీలున్నందున ఈ అంశంపైనా దృష్టిసారించాలి. ఇప్పటికే దాదాపుగా రూ.20 కోట్ల వరకు నిధులను ఇతర యార్డుల నుంచి తీసుకువచ్చి జిల్లాలోని యార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.

# సందిగ్ధంలో మానేరు రివర్ ఫ్రంట్ పనులు



కరీంనగర్ : అసెంబ్లీ ఎన్నికల ముందు టెండర్ పిలిచి ప్రారంభించని పనులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించడంతో మానేరు రివర్ ఫ్రంట్ పురోగతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరీంనగర్ దిగువ మానేరు జలాశయం ఉపయోగించి కొనసాగుతున్న మానేరు రివర్ ఫ్రంట్ పనుల్లో మొదటి దశలో ఇప్పటి వరకు 60 శాతం పూర్తి చేశారు. రెండో దశపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందా? లేదా అనే సందిగ్ధత నెలకొంది.

గతేడాది ప్రతిపాదనలు..

గత ప్రభుత్వం మానేరు వాగుపై రూ.కోట్లు వెచ్చించి తీగల వంతెన నిర్మాణం చేపట్టి కరీంనగర్‌కు కొత్త అందాలు తీసుకొచ్చింది. దీనికి అనుగుణంగానే వంతెన కింది భాగంలో మానేరువాగులో నీటిని నిల్వ చేసి పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పడవ ప్రయాణం, వాటర్ ఫౌంటెయిన్ ఇతర పనులు చేపట్టి పూర్తి చేయాలని అప్పటి మంత్రి గంగుల కమలాకర్ నిర్ణయించారు. గతేడాది నీటి పారుదల, పర్యాటక శాఖల సమన్వయంతో దిగువ మానేరు జలాశయం నుంచి తీగల వంతెన వరకు సుమారు 3.78 కిమీ పనులు చేపట్టాలని భావించి.. ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు.

ఎన్నికల ముందు పనులు చేపట్టకపోవడంతో కోడ్‌తో ఆగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.11,500 కోట్ల పనులను రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ పనులు కూడా ఉండటంతో అయోమయం నెలకొంది. రెండో దశకు సంబంధించి టెక్నికల్ ఫైనాన్షియల్ బిడ్ తెరిచినట్లు సమాచారం. మొదటి దశ పనులు జరుగుతుండగానే.. రెండో దశ పనులకు టెండర్ పిలిచినందున వీటిని కొనసాగించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా..

మానేరు రివర్ ఫ్రంట్ పనులకు సంబంధించి రూ.234.72 కోట్ల టెండర్‌ను 'కమిషనర్ ఆఫ్ టెండర్' విభాగానికి పంపారు. రెండో దశ పనుల విషయంలో టెండర్ల రద్దుపై స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరిస్తాం. – నాగభూషణం, ఈఈ, నీటి పారుదల శాఖ

మొదటి దశలో రూ.308 కోట్లు..

మానేరు రివర్ ఫ్రంట్ పనుల్లో భాగంగా మొదటి దశలో రూ.308 కోట్ల వ్యయంతో ప్రారంభించే పనులకు గత ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నిధులతో ఇప్పటివరకు 60 శాతం పూర్తి చేశారు. ఇంకా కొనసాగుతున్నాయి. మొత్తం 2.6 కి.మీ పనులు చేపడుతున్నారు. రెండు వైపులా గోడలు, ఫ్లాట్‌ఫాంకు సంబంధించిన రోడ్డు పనులు, నీరు వెళ్లే ప్రాంతాలలో రాళ్లను తొలగించడం వంటి పలు రకాల పనులకు నిధులు ఖర్చు చేయనున్నారు. గోడల పనులు తుది దశలో ఉన్నాయి. మిగతా పనులు కొనసాగుతున్నాయి.

రెండో దశలో రూ.234.72 కోట్లు

జిల్లాలోని దిగువ మానేరు జలాశయంలో రూ.234.72 కోట్ల వ్యయంతో 1.18 కిలోమీటర్లు అంటే 1100 మీటర్ల పనులను పూర్తి చేయాలని, ఇందులోనే నీటిని ఆపే గోడలు, బ్యారేజీ పనులతోపాటు కరీంనగర్ నగర వీధుల నుంచి వచ్చే మురుగునీరు బొమ్మకల్ వరకు చేర్చేందుకు ప్రత్యేక కాలువ నిర్మించాల్సి ఉంది. రెండో దశ పనులకు ఎన్నికల ముందే ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్ కోసం ప్రభుత్వానికి పంపించారు. ఇప్పటివరకు ఆ విషయంలో స్పష్టత రాలేదు. 2024లో ఈ పనులను పూర్తి చేయించి మానేరు రివర్ ఫ్రంట్‌ను ప్రారంభించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. నీటి పారుదల శాఖ ద్వారా పనులు పూర్తి కాగానే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పనులు చేయాల్సి ఉంది. దీనికి ఆనుకొనే హోటళ్ల నిర్మాణం జరగాలి. ఇదంతా పూర్తయితే ఉత్తర తెలంగాణలోనే కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన ప్రాంతం పర్యాటకానికి కేంద్రంగా నిలవనుంది.

# మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధం



కరీంనగర్ : ప్రతి రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతరకు వివిధ ప్రాంతాల నుంచి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి లక్షలాది మంది వెళ్తుంటారు. ఆర్టీసీ కూడా భక్తుల సౌకర్యార్థం మేడారానికి ప్రత్యేక బసులు నడుపుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగే జన జాతరకు కరీంనగర్ రీజియన్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు నిర్ణయించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సు (ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు)ల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. మేడారం జాతరకు కూడా రద్దీ అధికంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. బస్సుల నిర్వహణ, రద్దీని తట్టుకోవడం అధికారులకు సవాల్‌గా మారనుంది. సమ్మక్క, సారలమ్మ జాతర నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

ప్రత్యేక ఏర్పాట్లు..వనదేవతల జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆర్టీసీ అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి రద్దీ అధికంగా ఉంటుందనే అంచనాతో కరీంనగర్ బస్టాండ్‌లో మూడు క్యూలైన్ల సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలికంగా శౌచాలయాలు, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో వైద్య శిబిరాలు, ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడం, ప్రయాణికులను సహకరించడానికి ఆర్టీసీకి సంబంధించిన వివిధ శాఖల అధికారులను అందుబాటులో ఉంచనున్నారు. మరో వైపు మేడారంలో కూడా ప్రత్యేకంగా అధికారులను నియమించనున్నారు. రీజియన్ నుంచి ఈసారి వనదేవతల దర్శనానికి 4 లక్షలకు పైగా భక్తులు వెళ్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

బస్సుల మళ్లింపు

ఆర్టీసీ అధికారులకు మేడారం జాతర సవాల్‌గా మారనుంది. రద్దీని తట్టుకోవడం, బస్సుల నిర్వహణ ఇబ్బందిగా ఉండనుంది. రీజియన్‌లోని ఆర్టీసీకి సంబంధించిన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఇతర డిపోల నుంచి వచ్చిన బస్సులను మేడారానికి తిప్పనున్నారు. అదే సమయంలో గ్రామాలు, ఇతర పట్టణాలకు బస్సుల కొరతను ఎలా అధిగమిస్తారో చూడాల్సి ఉంటుంది. 2022లో కరోనా వ్యాప్తి కారణంగా మేడారానికి వెళ్లే వారి సంఖ్య తగ్గింది. ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతుందని అనుకుంటున్నారు. మరో వైపు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

750 సర్వీసులు..

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉండగా ఆయా డిపోల నుంచి మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 18 నుంచి 25 వరకు కరీంనగర్ రీజియన్ నుంచి 750 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. 325 కరీంనగర్ రీజియన్‌కు సంబంధించినవి కాగా 425 హైదరాబాద్ లేదా ఇతర డిపోల నుంచి సమకూర్చుకోవడంతోపాటు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. అవసరమైన చర్యలుమేడారం జాతరకు వెళ్లే వారి కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. 750 వరకు ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించాం. రద్దీని బట్టి అద్దె బస్సులను కూడా నడపడానికి ప్రయత్నిస్తాం. సంస్థలోని వివిధ శాఖల అధికారులను బస్టాండ్‌లో అందుబాటులో ఉంచుతాం. భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళలకు మాత్రం ఉచిత ప్రయాణం ఉంటుంది.

– ఎస్.సుచరిత (ఆర్ఎం), కరీంనగర్ రీజియన్

# లైనింగు పనుల్లో నాణ్యతడొల్ల

మల్యాల: మల్యాల మండలం తాటిపల్లి శివారులోని వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ కాలువ వరకు నిర్మించిన లింకు కెనాల్ లైనింగు పనుల్లో నాణ్యత లోపించడంతో పగుళ్లుబారాయి. తాటిపల్లి శివారు సమీపంలోని వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ కాలువలోకి నీటిని మళ్లించడానికి అప్పటి భారాస ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పనులు చేపట్టింది. లింకు కెనాల్ నిర్మాణం పూర్తి చేసిన తర్వాత ఏడాది క్రితమే గుత్తేదారు లైనింగు పనులు చేపట్టినప్పటికీ ఆరు నెలల్లోపే పలు చోట్ల పగుళ్లుబారి కూలిపోయింది. దీనిపై తాటిపల్లి గ్రామస్థులు పనుల నాణ్యతపై అప్పట్లో ఆందోళన చేపట్టారు. ఇంజినీరింగు అధికారులు గుత్తేదారు చేత లైనింగు దెబ్బతిన్నచోట మళ్లీ నిర్మించినప్పటికీ పాత కథే పునరావృతమైంది. పనుల్లో రాతిపొడి అధికంగా వినియోగించడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో తాటిపల్లి- ర్యాలపల్లె శివారులో లైనింగు పగిలిపోయి కూలిపోతున్నట్లు స్థానిక నాయకులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయమై మంగళవారం సాయంత్రం స్థానిక భాజపా నాయకులు కొత్తపెల్లి సంతోష్, కార్యకర్తలు, పలువురు రైతులు.. కూలిపోయిన లైనింగు ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు ఫిర్యాదు చేశారు. నాసిరకంగా నిర్మించిన లైనింగును తొలగించి.. మళ్లీ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని.. నాసిరకం పనులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# సన్నన్నం మాయమాయె..!

భానుపురి : బియ్యం ధరలు సామాన్య ప్రజలను భయపెడుతున్నాయి. సన్నరకం బియ్యం కొనాలంటే కొంచెం ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం సన్నరకాల ధరలు రూ.6 వేలకు చేరాయి. రెండు నెలల్లోనే వీటి ధర రూ.800 వరకు పెరిగింది. ఇటీవల సన్నరకం బియ్యం ధరలు రూ.5,200 ఉంది. రోజురోజుకూ ధరలు పెరుగుతుండటంతో సామాన్యులు కొనలేని దుస్థితి నెలకొంటోంది. సన్నరకాలకు ధరలు పెరగక ముందు రేషన్ బియ్యానికి డబ్బులు తీసుకునేవారు. ప్రస్తుతం వాటిని ఇంటికి తెచ్చుకొని పాలిస్ చేసుకొని తింటున్నారు. ఇతర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి బాగా తగ్గింది. అక్కడ డిమాండ్ ఉండటంతో



వ్యాపారులు బియ్యం నిల్వలు ఎక్కువగా చేసుకోవడంతో ధరలు పెరిగాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏటా సన్నాల సాగు తగ్గుతోంది. వీటికి పెట్టుబడి ఖర్చు ఎక్కువగా రావడంతో వాటి సాగును అన్నదాతలు తగ్గిస్తున్నారు. దీంతో సన్నాలకు కొరత ఏర్పడడంతో పాటు మన దగ్గర మిల్లులు ఇతర ప్రాంతాలకు తరలించడంతో డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సోన రకం పాత బియ్యం క్వింటాకు రూ.6వేలు, కొత్త రకం రూ.5,500 పలుకుతోంది. వర్షాభావం కారణంగా ఇతర రాష్ట్రాల్లో పంటలు నష్టపోవడం, ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాగు తగ్గడంతో ఇంకా బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

యాసంగి పంటపై చూపని ఆసక్తి: వేసవిలో పండించిన వరిపై ఎక్కువగా ఎవరూ ఆసక్తి చూపటం లేదు. ఈ పంట వడ్లను మర పట్టిస్తే నూకల శాతం అధికంగా ఉంటుంది. చాలా మంది ఖరీఫ్ సమయంలోనే బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. గతేడాది ధాన్యం నిల్వలు చేసుకున్న వారు ఇప్పుడు లాభపడుతున్నారు. రవాణా, కూలీ, బస్తాల పెరగడంతో కొంతమేర బియ్యం ధరలపై ప్రభావం పడుతున్నాయి.

# ప్రోత్సాహక నిధులు ఎప్పుడొస్తాయో..!

సూర్యాపేట : ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.4200 చొప్పున నిర్వహణ ఖర్చులు అందిస్తూ ప్రోత్సహిస్తోంది. అన్నదాతలకు రాయితీలపై అవగాహన కల్పించి ఆయిల్‌పామ్ సేద్యంపై దృష్టిసారించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఒక వైపు నిర్వహణ ఖర్చు వస్తుండటం, మరోవైపు అంతర పంటలు సాగు చేసుకునే వెసులుబాటు ఉండటంతో రైతులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో ఎప్పటికప్పుడు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అయ్యేవి. గత ఏడాదికి సంబంధించి ప్రోత్సాహక నిధులు జూన్, జులైలోనే రావాల్సి ఉండగా ఆరు నెలలుగా రావడం లేదు. కొత్తగా సాగు చేసిన రైతులకు రాయితీ నిధులు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.5.44 కోట్లు బకాయి

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యం 35,600 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 12,970 వరకు సేద్యం చేస్తున్నారు. ఏటా లక్ష్యానికి అనుగుణంగా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, ఆదాయాలను వివరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,240 మంది రైతులకు 11,400 ఎకరాలకు సంబంధించి ఎకరానికి రూ.4200 చొప్పున రూ.5.44 కోట్లు రావాల్సి ఉంది. శాసనసభ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన నిర్వహణ నిధులు నేటికీ విడుదల కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది యాసంగి సీజన్‌లో రైతులను ఎంపిక చేసి వారికి ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారు. వీరికి నాలుగేళ్ల వరకు ఎలాంటి ఆదాయం వచ్చే అవకాశం లేకపోవడంతో అంతర పంటల సాగుకు ఎకరాకు రూ.2,100, తోట



నిర్వహణ కింద మరో రూ.2,100 చొప్పున విడుదల చేయాలి. నేటికీ ఎలాంటి ప్రోత్సాహం నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నాం

-వెంకన్న, చివ్వెంల, రైతు

ఐదెకరాల్లో రెండేళ్ల క్రితం ఆయిల్‌పామ్ సాగు చేపట్టాను. మొదటి విడత ప్రోత్సాహకం కింద ఎకరానికి రూ.4200 చొప్పున రూ.21,000 ఖాతాలో జమ చేశారు. కానీ, గతేడాదికి సంబంధించిన మొత్తం రాలేదు. అంతర పంటతో ఆదాయం వస్తున్నా.. ఆయిల్‌పామ్ మొక్కల నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేయాలి.

రైతులు ఆందోళన చెందొద్దు

జగన్, ఉద్యాన శాఖ డివిజన్ అధికారి, సూర్యాపేట

ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి ప్రోత్సాహకం నిధులు ఈసారి విడుదల కాలేదు. శాసనసభ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం త్వరలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఫిబ్రవరి మొదటి వారంలో రైతుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# ఎండలు ముదరకముందే.. గిర్రున మీటర్లు

హైదరాబాద్: నగరంలో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. రాత్రి చలి వణికిస్తున్నా.. పగలు చలిగాలులు, ఎండలు లేకపోయినా విద్యుత్తు డిమాండ్‌లో పెరుగుదల నమోదవుతోంది. జనవరి ఆరంభం నుంచి ఇదే పరిస్థితి సిటీలో నెలకొంది. ఫిబ్రవరిలో మరింత పెరిగే అవకాశం ఉండటంతో 10వ తేదీలోపు మరమ్మతులు పూర్తి చేసేందుకు సిబ్బందిని టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ పరుగులు పెట్టిస్తున్నారు. రెండు గంటలకు మించి విద్యుత్తు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేస్తున్నట్లయితే అందుకు గల కారణాలపై ఎస్‌ఈల నుంచి ఆరా తీస్తున్నారు.గత ఏడాది జనవరితో పోలిస్తే రోజువారి సగటు 10 మిలియన్ యూనిట్లు పెరిగింది. 2023 జనవరి 29న




46.3 మిలియన్ యూనిట్ల వినియోగం ఉంటే.. ఈసారి 56.2 మిలియన్ యూనిట్లకు పెరిగింది. డిమాండ్‌లోనూ ఇదే ధోరణి కన్పించింది. క్రితం సంవత్సరం 2303 మెగావాట్ల డిమాండ్ ఉండగా.. ఇప్పుడు 2918 మెగావాట్లకు పెరిగింది.ఈ నెలలో అత్యధికంగా 25న 3018 మెగావాట్లు దాటింది.

రాబోయే రోజుల్లో: ఈసారి మే నెలలో విద్యుత్తు డిమాండ్ 4 వేల మెగావాట్లు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

60శాతం పూర్తి: ఎండలు తీవ్రం కాకముందే 11కేవీ ఫీడర్లు, 33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల మరమ్మతులు పూర్తిచేయాలని డిస్కం లక్ష్యంగా పెట్టుకుంది.

జనవరి 30 నాటికి గ్రేటర్‌లోని 346 విద్యుత్తు 33 కేవీ ఉపకేంద్రాల్లో 202 పూర్తయ్యాయి. దాదాపు 60 శాతం పూర్తిచేశారు.

11కేవీ ఫీడర్లు 3288 ఉండగా.. 2621 పూర్తి చేశారు.

# చెట్లు నరికేస్తున్నా.. చోద్యం చూడటమేనా!

వికారాబాద్ : జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఖనిజ సంపద తవ్వకాలు, చెట్లను నరికేయడం వంటి చర్యలపై క్షేత్రస్థాయిలో నిఘా కొరవడటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఫలితంగా అటవీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.

పట్టాలివ్వడాన్ని ఆసరాగా తీసుకుని.. దశాబ్దాల తరబడి జిల్లాలో సాగు చేసుకుంటున్న భూములను గత భారాస ప్రభుత్వం పోడు వ్యవసాయం కింద పరిగణించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పట్టాలివ్వడానికి సిద్ధమైంది. ఇందుకు పోడు భూముల సర్వే చేశారు. ఇదే అదనుగా అక్రమార్కులు గ్రామ శివారుల్లోని సరిహద్దు అటవీ భూముల్లోని భారీ వృక్షాలను సైతం రాత్రికి రాత్రి నరికేసి, ఎగుడు దిగుడుగా ఉన్న భూములను చదును చేశారు. తాతముత్తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నామని, పోడు భూములుగా పరిగణించి పట్టాలివ్వాలని పలువురు అర్జీలు పెట్టుకొని నమ్మించే ప్రయత్నం చేశారు.

ఒక్క దోర్నాల్‌లోనే 60 ఎకరాలు

జిల్లాలోని ధారూర్ మండలం దోర్నాల్, యాలాల్, పెద్దేముల్ మండలాల పరిధిలోని దాదాపు 250 ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఒక్క ధారూర్ మండలం దోర్నాల్ శివారులో 60 ఎకరాల భూములను అదే తరహాలో ఆక్రమించినట్లు సమాచారం. ఇందుకు అటవీశాఖలోని ఉద్యోగి ఒకరు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

: ఎట్టకేలకు దోర్నాల్ పరిధిలో ఆక్రమణ భూములను అటవీశాఖ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని భూములు కలిగి ఉన్న రైతులే చెట్లను నరికి ఎవరికి కలిసే భూమిని వారు ఆక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. నరికివేతకు గురైన చెట్ల స్థానంలో మళ్లీ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు.

కలిసొస్తున్న అధికారుల ఖాళీలు

జిల్లా భూ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఐదు రేంజ్‌ల పరిధిలో విస్తరించి ఉంది. ఒక్కో రేంజ్‌కు ఒక్కో క్షేత్రాధికారి ఉన్నారు. మొత్తం జిల్లా భూ విస్తీర్ణంలో 1.1 లక్షల ఎకరాల్లో అడవులు వ్యాపించి ఉన్నాయి. ప్రతి 1500 ఎకరాల విస్తీర్ణంలో అటవీ భూమికి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఓ బీట్ అధికారి ఉండాలి. ఆ విధంగా లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడి అడవులు ఆక్రమణకు గురవుతున్నాయి. జిల్లాలో అనంతగిరి, ధారూర్, పెద్దేముల్, తట్టేపల్లి, యాలాల, కుల్కచర్ల మండలాల్లో అడవులు ఉన్నాయి.

క్షేత్ర స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం
- జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

జిల్లాలో అటవీ భూముల ఆక్రమణపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్నిచోట్ల సర్వే చేసి హద్దు రాళ్లను పాతించాం. సమన్వయ లోపంతో కొన్ని ప్రాంతాల్లో అటవీ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలివ్వడంతో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ పట్టాలను రద్దు చేయించి భూములను స్వాధీనం చేసుకున్నాం. బీట్ అధికారులను నియమించాలని గతంలోనే నివేదించాం.

# పరిమితికి మించి సూక్ష్మ ధూళి కణాలు

హైదరాబాద్: నగరంలో ఏటా పరిమితికి మించి పీఎం 10 స్థాయిలు నమోదవుతున్నాయి. దీని వల్ల శ్వాసకోశ సమస్యలు ఇతర అనారోగ్యాలు తలెత్తే అవకాశం ఉందని 'ప్రాణ' (పోర్టల్ ఫర్ రెగ్యులేషన్ ఆఫ్ ఎయిర్ పొల్యూషన్ ఇన్ నాన్ ఎలైన్‌మెంట్ సిటీస్) అధ్యయనంలో వెల్లడించింది. గత ఐదేళ్లలో నగరంలో కాలుష్యంపై అధ్యయనం చేసిన సంస్థ ఇటీవలే ఓ నివేదికను విడుదల చేసింది. గత ఐదేళ్లతో పోల్చితే ఏటా తగ్గుతూ వస్తున్నప్ప టికీ, నిర్దేశిత పరిమితి కంటే అధికంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్' అధ్యయనం లోనూ ఇదే విషయం వెల్లడైంది. వాహన కాలుష్యం, రోడ్లపై దుమ్ము, ధూళి, భవన నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉందని వెల్లడించిం ది. ఏటా జనాభా, వాహనాల సంఖ్య పెరగడం, బహిరంగంగా చెత్త దహనం, కూడళ్ల వద్ద రద్దీతో ఉద్గారాలు అధిక మోతాదులో వెలువడుతు న్నాయి. పీసీబీ నివేదికల ప్రకారం 2023లో జూ పార్కు వద్ద 249 పాశమైలారం-164, బొల్లారం-170, హెచ్‌సీయూ-142, ఇక్రిశాట్-173, నాచారం-101, బాలానగర్-142, శామీర్‌పేట్-112, జీడిమెట్ల- ఘనపు మీటర్ గాలిలో 140 మైక్రో గ్రాములుగా నమోదైంది. నియంత్రణ ఇలా..: అవసరమైన మేరకే వాహనాలను వినియోగించాలి. ప్రజారవాణాకే మొగ్గు చూపాలి. బహిరంగంగా చెత్త కాల్చొద్దు. మరమ్మతులకు గురైన వాహనాలను నడపొద్దు.

# అనుబంధ కళాశాలల్లో పీహెచ్‌డీ పరిశోధనలు



హైదరాబాద్: ఉస్మానియా, జేఎన్‌టీయూ, తెలుగు విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు మాత్రమే పరిశోధకులు అయ్యేందుకు అవకాశాలుండగా.. జేఎన్‌టీయూ హైదరాబాద్ తన పరిధిలోని అనుబంధ కళాశాలల్లోనూ పీహెచ్‌డీ ప్రవేశాలను నిర్వహించుకోవచ్చని అనుమతులిచ్చింది. ఈ నిర్ణయంతో కొన్ని కళాశాలలు పీహెచ్‌డీ ప్రవేశాలు చేస్తుండగా మరికొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. పీహెచ్‌డీ ప్రవేశాలు, పరిశోధన విద్యార్థులకు మార్గదర్శకులుగా వ్యవహరించే సూపర్‌వైజర్లను జేఎన్‌టీయూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు పదవీ విరమణ చేస్తుండడంతో సూపర్‌వైజర్ల కొరత ఏర్పడింది. ఈనేపథ్యంలో జేఎన్‌టీయూ అధికారులు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ పీహెచ్‌డీకి అనుమతుల్విడం ద్వారా వచ్చే నాలుగైదేళ్లలో డాక్టరేట్ పొందేవారి సంఖ్య పెరగనుంది. వీరు ఆయా వర్సిటీలు, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో యూజీసీ నిబంధనలకు అనుగుణంగా సహాయ ఆచార్యులుగా నియమితులయ్యేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం జేఎన్‌టీయూ పరిధిలో 216 అనుబంధ కళాశాలుండగా... వీటిల్లో కొన్ని ఇప్పటికే పరిశోధన కేంద్రాలను ప్రారంభించాయి. ఇందుకు వీలుగా రూ.25 లక్షలతో కార్పస్ నిధిని ఏర్పాటు చేశాయి. పరిశోధన కేంద్రం కాల వ్యవధి మూడేళ్లు. ఈ మూడేళ్లలో జేఎన్‌టీయూ నిర్దేశించిన ప్రమాణాలు పాటించకపోతే గుర్తింపు రద్దయ్యే అవకాశాలున్నాయి.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ.. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లోని పరిశోధన కేంద్రాలను జేఎన్‌టీయూ సలహా కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించనుంది. సలహా కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు లభించేలా పరిశోధన ప్రాజెక్టులు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు అనుబంధ కళాశాలలు వేర్వేరుగా నోటిఫికేషన్ జారీ చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తున్నింటినీ జేఎన్‌టీయూ దృష్టికి తీసుకెళ్లాలి. బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ అనుమతి పొందాకే విద్యార్థులకు ప్రవేశం కల్పించాలి. ఒక పరిశోధక విద్యార్థికి ఒకే పర్యవేక్షకుడు ఉండాలి.

# ఆసుపత్రి స్థాయి సేవలేవీ?




వికారాబాద్ :కొడంగల్‌లో ప్రస్తుతం ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలుగా మార్చేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. అయితే కావాల్సినంత మంది సిబ్బంది లేక సమస్యలు ఎదురవుతున్నాయి. రోజుకు 50 మంది నుంచి 150 మంది రోగులు వస్తున్నారు. సివిల్‌సర్జన్, గైనకాలజిస్ట్, ఇతర సిబ్బంది తక్కువగా ఉండటంతో సేవల్లో లోపం ఏర్పడుతోంది. మందులకు ఎలాంటి కొదవలేదని అధికారులు వివరిస్తున్నారు.

ఘన చరిత్రకే పరిమితమా..తాండూరు జిల్లా ఆస్పత్రి అంటే సుదీర్ఘ చరిత్ర ఉంది. నిత్యం 600 నుంచి 800 మంది రోగులు వస్తుంటారు. కొన్నేళ్లుగా ఖాళీలు భర్తీ చేయడంలేదు. ఇక్కడకు కేవలం పట్టణంనుంచే కాదు జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలు, పొరుగు జిల్లాల ఉంచి కూడా వస్తుంటారు. సిబ్బంది లేక వీరందరికీ సకాలంలో సేవలందడంలో జాప్యం జరుగుతోంది. ఆస్పత్రిలో చేరి వైద్య సేవలు పొందే వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనం అందిస్తున్నారు. కొత్తది త్వరగా పూర్తిచేస్తేనే ప్రయోజనంజిల్లా కేంద్రంలో 8 నెలల క్రితం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రిగా మార్చారు. దీంతో బయటి రోగులు గతంలోకంటే రెండింతలయ్యారు. అయితే సిబ్బందిని, సౌకర్యాలను పెంచలేదు. ఫలితంగా రోగులకు అవస్థలు తప్పడంలేదు. కొత్తగా సుమారు రూ.4 కోట్ల వ్యయంతో అనంతగిరి రోడ్డు మార్గంలో రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో అన్ని హంగులతో జనరల్ ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి పూర్తిగా ఇరుకుగా ఉంది. రోగులకు సరిపోవటం లేదు. సరైన కుర్చీలు కూడా లేక కింద కూర్చుంటున్నారు. కొత్త భవనంలోకి ఆసుపత్రిని మార్చితేనే ప్రయోజనమని రోగులు కోరుతున్నారు.

బోర్డు ఒక్కటే మారింది

పరిగి ఆసుపత్రిని ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం వైద్య విధాన పరిషత్‌లోకి మార్చింది. దీంతో స్థాయి పెరిగి సదుపాయాలు సమకూరుతాయని హర్షం వ్యక్తమైంది. కానీ ఇప్పటివరకు బోర్డు మారిందే తప్ప ఎలాంటి ప్రాథమిక సదుపాయాలు సమకూర్చలేదు.

వెయిటింగ్ హాల్ చివరి దశలో ఆగింది. ఎక్స్‌రే ప్లాంటు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

ప్రాణాప్రాయ సమయంలో రోగులను తరలించేందుకు అంబులెన్స్ కూడా లేదు.

డయాలసిస్ కేంద్రం మాత్రం పేదలకు పెన్నిధిగా మారింది.

రోజూ వచ్చే రోగులు.. 800
మొత్తం పడకలు.. 250
చేరేది.. రోజుకు 60
ప్రస్తుతం వస్తున్న రోగులు.. 500
గతంలో.. 300
నిత్యం వచ్చే రోగులు.. 400వైద్య సిబ్బంది.. 22 మంది

# పురపాలిక ప్రగతికి రూ.300 కోట్ల ప్రతిపాదనలు

కొడంగల్ : కొడంగల్ పురపాలక పరిధిలో అభివృద్ధి పనులకు వేగంగా అడుగులు పడుతున్నాయి. 2020 జనవరి 27న పురపాలికల్లో కార్యవర్గాలు బాధ్యతలు చేపట్టగా నాలుగేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి ఒక వంతుగా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి పరిధి కావడంతో ఇక నుంచి చేపట్టే అభివృద్ధి మరో రకంగా ఉండనుంది. ప్రగతి పనులకు రూ.300 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగడంతో పాటు పురపాలకశాఖ సీఎం దగ్గరే ఉండటంతో నిధులకు ఆటంకాలు లేకుండా ఇప్పటికే పురపాలకశాఖ రాష్ట్రస్థాయి అధికారులు పర్యటించారు. ఫిబ్రవరి 5న రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో నేడు పురపాలక శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానకిశోర్ వస్తున్నట్లు కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సుందరీకరణకు ప్రాధాన్యం: పట్టణ అభివృద్ధితో పాటు వివిధ ప్రాంతాల సుందరీకరణకు సన్నద్ధమవుతున్నారు. పురపాలక పరిధిలోని పాతకొడంగల్, పాతకొడంగల్‌తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, ఐనోన్‌పల్లి, బుల్కాపూర్ పరిధిలో అభివృద్ధి అంతంత మాత్రంగానే కొనసాగింది. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో 'కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' (కడా) ఏర్పాటుతో అధికారుల పర్యటనలు, అంచనాల తయారుతో పనుల వేగం పెంచుతున్నారు. పట్టణ



పరిధిలోని కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.37 కోట్లు, మురుగు కాలువల నిర్మాణాలకు రూ.35 కోట్లు, తాగునీటి సరఫరాకు రూ.20 కోట్లు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ.18 కోట్లు, పార్కులు, జిమ్‌ల ఏర్పాటుకు రూ.16 కోట్లు ఇలా వివిధ పనులకు రూ.300 కోట్లు కేటాయించాలని అంచనాలు సిద్ధం చేశారు. ఇప్పుడున్న పాలకవర్గం పదవీకాలం ఏడాది ఉంది. పనులు కొనసాగితే కొడంగల్ పట్టణ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొడంగల్ పట్టణం, పురపాలిక పరిధిలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేశామని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దీన్లో భాగంగా ప్రధాన కార్యదర్శి మరోసారి పరిశీలించేందుకు కొడంగల్ వస్తున్నట్లు వివరించారు.

# కార్యాలయాల్లేని వైద్యాధికారులు

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలను అందుబాటులోకి తీసుకువచ్చిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆయా దవాఖానాల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది పనితీరును పర్యవేక్షించేందుకు గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జిల్లాస్థాయి అధికారులను నియమించింది. హైదరాబాద్‌లో ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్లు, రంగారెడ్డిలో ఎల్బీనగర్, మేడ్చల్‌లో కూకట్‌పల్లి జోన్లను ఏర్పాటు చేసి ఆయా జోన్ల బాధ్యతను వైద్యాధికారులకు అప్పగించింది. అయితే ఇప్పటివరకూ వైద్యారోగ్యశాఖ వారికి కార్యాలయాలను అందుబాటులోకి తీసుకురాలేదు. కనీసం అద్దె భవనాలను కేటాయించలేదు. దీంతో బాధ్యతలు స్వీకరించిన ఆయా జోన్ల వైద్యాధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం లేదా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి వచ్చి హాజరు వేసుకుని వెళ్తున్నారు.



నగర శివార్లు.. జనావాసాలు.. నగర శివార్లలో జనావాసాలు వేగంగా పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు కొత్తగా 108 బస్తీ, పల్లె దవాఖానాలను సర్కారు అందుబాటులోకి తీసుకొచ్చింది. పాత, కొత్త ఆసుపత్రులను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులు పర్యవేక్షిస్తుండగా.. వారిపై పని ఒత్తిడి తగ్గించేందుకు కొత్తగా నాలుగు జోన్లు ఏర్పాటు చేసింది. అధికారులను నియమించి బస్తీ దవాఖానాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో బస్తీ, పల్లె దవాఖానాల్లో కొన్నింటిని కేటాయించింది.

సమావేశాలు, సందర్శనలకే పరిమితం.. బాధ్యతలు స్వీకరించిన వారికి కార్యాలయం లేకపోవడంతో జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్వహించే సమావేశాలకు హాజరవుతున్నారు. ఈ సమావేశాలు లేనప్పుడు వారికి కేటాయించిన బస్తీ, పల్లె దవాఖానాల్లో కొన్నింటిని ఎంచుకుని వాటిని సందర్శిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన జోన్లలో ఒక్కో జోన్‌కు నలభై ఆసుపత్రులను కేటాయించడంతో అక్కడి పరిస్థితులు తెలుసుకుని నివేదికలు రూపొందించుకుంటున్నారు.

# ఉపాధితోడు.. కుటుంబానికి చేదోడు

తాండూరు : గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే లక్ష్యంగా అమలు చేస్తున్న 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకంలో మహిళలే పురుషుల కంటే ఎక్కువగా పాల్గొంటున్నారు. సద్వినియోగం చేసుకుని కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. వలస వేళ ఆదుకుంటుందని చొరవ: జిల్లాలోని 20 మండలాల్లో నాలుగు మున్సిపాలిటీలు మినహా 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పట్టణ జనాభాతో పోలిస్తే గ్రామీణ ప్రాంత జనాభా నాలుగింతలు అధికంగా ఉంది. ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ముగిశాక గ్రామాల్లో ప్రజలు ఉపాధిలేక ఖాళీగా ఉంటున్నారు. కుటుంబాల పోషణకు గత్యంతరంలేక కొందరు వలస వెళ్తున్నారు. ఈ బాధల్ని తప్పించేందుకు ఉపాధిహామీ పథకం అక్కరకు వస్తోంది. గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామీణ ప్రజలకు విరివిగా ఉపాధిహామీ పనులు కల్పిస్తోంది. దీంతో గ్రామాల్లో పురుషుల కంటే మహిళలు ఉత్సాహంగా ఉపాధి పనులకు హాజరవుతున్నారు. కొలతల ప్రకారం ఉదయం, సాయంత్రం పనిచేస్తే రూ.272

ఉపాధిహామీ పథకం పనులను ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు గంటలపాటు అధికారులు నిర్దేశించిన కొలతల ప్రకారం చేస్తే రోజుకు రూ.272లు చెల్లిస్తున్నారు. దీన్ని నేరుగా కూలీల ఆధార్ కార్డు సంఖ్యకు అనుసంధానంగా ఉన్న బ్యాంకు, తపాలా ఖాతాల్లో జమ చేస్తున్నారు. మహిళలు కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేస్తున్నారు. మరికొందరు వన సేవకులుగా పనిచేస్తూ నెలనెలా వేతనం పొందుతున్నారు.

పిల్లల చదువులకు పొదుపు చేస్తున్నా : సరిత, ఐనెల్లి

నాలుగు సంవత్సరాలుగా ఉపాధి పనులలో పాల్గొంటున్నా. డబ్బులు రెండు వారాల్లో పోస్టాఫీసు ఖాతాలో జమవుతున్నాయి. వాటిని పిల్లల చదువుల నిమిత్తం పొదుపు చేస్తున్నాం. ఖర్చులు తగ్గించుకుంటున్నాం.

ఇంటి ఖర్చులకు ఉపయోగం : వి.జ్యోతి, పర్వతాపూర్

ఉపాధిహామీ పనికి ప్రతిరోజు వెళ్తా. వచ్చిన కూలి డబ్బుల్లో కొంత ఇంటి ఖర్చులకు వినియోగిస్తున్నాం. కొంత పొదుపుచేస్తూ జాగ్రత్త పడుతున్నాం. సద్వినియోగం చేసుకుంటున్నారు: స్టీవెన్ నీల్, అదనపు డీఆర్‌డీఓ గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు మహిళలు ఎక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. కూలి డబ్బులు తొందరగా ఖాతాల్లో జమవుతుండటంతో కుటుంబానికి ఆసరగా ఉపయోగపడుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు తెచ్చుకునేందుకు నగదు చెల్లిస్తున్నాం. జాబ్‌కార్డులు: 1,82,997 నమోదైన కూలీలు: 3,76,510 పనులకు హాజరు: 2,52,741 పురుషులు: 1,24,268 మహిళలు: 1,28,473

# అక్రమ నిర్మాణాలను ఉపేక్షించొద్దు

శంషాబాద్: అక్రమ నిర్మాణాలను అధికారులు ఉపేక్షించొద్దని, అలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని డీటీసీపీ రీజినల్ డైరెక్టర్ నరసింహారెడ్డి హెచ్చరించారు. ఈ నెల 28న 'అక్రమాల అంతస్తులు' వెలువడిన కథనాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. శంషాబాద్‌లో జీవో సంఖ్య 111 నిబంధలను ఉల్లంఘించి వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని డీటీసీపీ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో డీటీసీపీ రీజినల్ డైరెక్టర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల బృందం మంగళవారం శంషాబాద్‌లో క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. అనుమతులు లేకుండానే వందల సంఖ్యలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల పనులు జోరుగా సాగుతుండడంతో విస్తుపోయారు. కొంత మంది అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమ నిర్మాణదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు వారి విచారణలో తేలింది. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాల కట్టడిపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.. డీటీసీపీ అధికారులు సత్యభామ, భాగ్యలక్ష్మి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, టీపీవో టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మనకు బోగి భాగ్యం!

వరంగల్ : విద్యా కేంద్రంగా పేరున్న ఓరుగల్లు ఇక నుంచి పరిశ్రమలకు నిలయంగా మారనుంది. ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ రావాలని ఉద్యమాలు చేశారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ప్రజల వినతులు మన్నించి బోగీలను తయారు చేసే యూనిట్తోపాటు రైళ్ల సర్వీసు చేసే పీవోహెచ్ మంజూరు చేసింది. దీనికి శనివారం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు.
: ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పరిశ్రమగా ఇది నిలవనుంది. అనుబంధ పరిశ్రమలు రావడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఇది సాంకేతికంగా అన్ని అంశాల్లో ముందు వరుసలో ఉంటుంది. ఉదాహరణకు కార్మికులకు రసాయనాల వల్ల హాని కలగకుండా బోగీలకు రోబో టెక్నాలజీతో రంగులు వేసే పరికరాలు ఇందులో ఉంటాయి. పరిశ్రమలో అనేక విభాగాలు ఉన్నాయి.. సిబ్బందికి పెద్ద క్యాంటీన్, సరిపడా మరుగుదొడ్లు, విశాలమైన పార్కింగ్, సకల సౌకర్యాలు కల్పిస్తారు.
పరిశ్రమ నుంచి కాలుష్యం బయటకు రాకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి ఈ ప్రాంతంలో ఎక్కువగా చెట్లు పెంచుతారు. ఇదంతా పచ్చగా ఉంటుంది.
పరిపాలనా విభాగం ఇక్కడే ఉంటుంది. ముఖ్య అధికారులు, ఉన్నతాధికారుల కోసం నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్. సకల సదుపాయాలు ఉంటాయి.
ఇవన్నీ రైలు పట్టాలు. కాజీపేట జంక్షన్ వరకు వీటిని అనుసంధానం చేస్తారు. వ్యాగన్లు తయారు చేశాక బోగీలను ఈ పట్టాల వెంట బయటకు తీసుకొచ్చి, కావాల్సిన చోటికి తరలిస్తారు.
ఈ నాలుగు భారీ షెడ్లలో అనేక కార్యశాలలు ఏర్పాటుచేస్తారు. వ్యాగన్‌ల బరువు కొలిచే వై బ్రిడ్జ్, బోగీలను తయారు చేసే కేంద్రం, చక్రాలను తయారుచేసేవి, విడిభాగాలన్నీ తయారయ్యాక బిగించే 'బాడీ



అసెంబ్లీ షాప్', రోబో సాంకేతికతతో మనుషులు లేకుండా బోగీలకు రంగులు వేసే పెయింట్ షాప్ అన్నీ వీటిల్లోనే ఏర్పాటుచేస్తారు.
ఇవీ ప్రత్యేకతలు..కాజీపేట మండలం అయోధ్యపురంలో ఏర్పాటు చేయనున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ పలు ప్రత్యేకతల సమాహారం. ఆ వివరాలు.. తయారీ సంస్థ: భారతీయ రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ బాధ్యతలను రైల్వే నిగమ్ లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 24 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తారు. ఖర్చు: రూ.521 కోట్లు. పూర్తిగా నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ వ్యయం మరింత పెరగవచ్చు.
అవసరం: ప్రస్తుతం దేశంలో 22,790 మెట్రిక్ టన్నుల సరకు రవాణాకు మాత్రమే వ్యాగన్‌లు ఉన్నాయి. మరో 7000 మెట్రిక్ టన్నుల సరుకు రవాణాకు ఇవి అవసరం. కాజీపేటలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమతో ఈ సమస్య తీరుతుంది.
ఉపాధి: మొదటి దశలో ఇతర ప్రాంతాల్లో పనిచేసే 1200 మంది రైల్వే ఉద్యోగులను బదిలీపై తీసుకు వస్తారు. పని పెరుగుతున్న కొద్దీ ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రత్యేకంగా క్వార్టర్ల నిర్మాణం చేపడతారు.
పర్యావరణం: పరిశ్రమ కోసం నిర్మించిన షెడ్లకు గాజు గ్లాసులను అమర్చి సహజ వెలుగులను ఉపయోగించుకుని విద్యుత్తును ఆదా చేస్తారు.
సౌరవిద్యుత్తు: షెడ్లపైన సౌరఫలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు.
ఆధునిక పరిజ్ఞానం: పరిశ్రమలో తయారైన వ్యాగన్‌లకు రోబోల ద్వారా రంగులు వేస్తారు.
లాభం: వ్యాగన్‌ల ఉత్పత్తి వల్ల రవాణా పెరిగి వ్యవసాయానికి ఊతం ఇస్తుంది. అన్సలరీ పరిశ్రమలు చుట్టుపక్కల వచ్చే అవకాశం ఉంది. సింగరేణి, సిమెంట్, ఎఫ్‌సీఐ పరిశ్రమలకు రవాణా కోసం త్వరగా రైళ్లను కేటాయించగలుగుతారు. కాజీపేటలో ఉద్యోగుల సంఖ్య పెరగడం వల్ల దీన్ని రైల్వే డివిజన్‌గా ప్రకటించే అవకాశం ఉంది.

# సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేనా?

మెట్‌పల్లి : ఎస్సారెస్పీ కాకతీయ కాలువ సిమెంట్ లైనింగ్ పలుచోట్ల దెబ్బతినడంతో పూర్తిస్థాయిలో నీరు విడుదల కాక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. కాకతీయ కాలువ లైనింగ్ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. 2016లో కొంత మేర పనులు చేపట్టగా ఇటీవల మళ్లీ లైనింగ్ పనులు మొదలు పెట్టగా కాలువకు నీరు విడుదల చేసే సమయానికి పూర్తవుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై జిల్లాలో పలు గ్రామాలు సాగు, తాగునీటికి ఆధారపడ్డాయి. ఏళ్లుగా మరమ్మతులు జరగక పలు చోట్ల కాకతీయ కాలువ లైనింగ్ దెబ్బతింది. కాకతీయ కాలువ పూర్తి సామర్థ్యం 9600 క్యూసెక్కుల కాగా ఐదారు వేల క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేసే పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వం లైనింగ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. 2016లో మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో రూ.28.72 కోట్లతో 4వ కిలోమీటర్ నుంచి 68.3 కిలోమీటర్ వరకు లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. పలు చోట్ల పనులు ప్రారంభించారు. వెల్లుల్ల శివారులో లైనింగ్ పనులు చేపట్టారు. కొంత మేర పూర్తి చేసిన తర్వాత మళ్లీ పనులు కొనసాగడంలేదు. ఇటీవల మండలంలోని రామారావుపల్లె శివారులో 47.160 నుంచి 50.130 కిలోమీటర్ వరకు రూ.7.60 కోట్లతో లైనింగ్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. కాలువకు నీరు విడుదల చేయకముందే పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.
నాణ్యత పాటిస్తేనే..లైనింగ్ పనులు హడావుడిగా కాకుండా నాణ్యతతో చేస్తేనే పదికాలాల పాటు మన్నికగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2016లో వర్షాలు కురిసే సమయంలో వెల్లుల్ల శివారులో లైనింగ్ పనులు చేశారు. కొంతకాలానికి వరద నీటికి పలుచోట్ల దెబ్బతింది. మే నెలలో చదును పనులు ప్రారంభించి ప్రస్తుతం సిమెంట్ లైనింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రాజెక్టులోకి నీరు చేరితే దిగువన కాకతీయ కాలువకు వదలాల్సి ఉంటుంది. నీరు వదిలితే పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు స్పందించి పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఈ సారి చేరికలు అంతంతే..




ఖమ్మం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభమై నెల రోజులు దాటినా ప్రవేశాలు మాత్రం నత్తనడక సాగుతున్నాయి. కొన్ని కళాశాలల్లో చాలా స్వల్ప సంఖ్యలో విద్యార్థులు చేరటం విశేషం. గడువు (ఈనెల 20) సమీపిస్తున్నా ప్రవేశాలు ఊపందుకోకపోవడంతో మొదటి సంవత్సరం తక్కువ మంది విద్యార్థులతో తరగతులు వెలవెలబోతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది.
ఒకేసారి లాగిన్ ఇవ్వటంతో...
ఏటా ప్రవేశాల కోసం ప్రభుత్వ కళాశాలలకు ముందుగా లాగిన్ ఇచ్చి తర్వాత రెండు నెలలకు ప్రైవేటు కళాశాలలకు ఇచ్చారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు లాగిన్ సదుపాయం ఒకేసారి వచ్చింది. ఈసమయంలో ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు మూల్యాంకనంలో నిమగ్నమై ఉండగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థుల హాల్ టికెట్లు తీసుకుని లాగిన్ చేశారు. దీని ప్రభావం ప్రవేశాలపై పడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ, మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటుచేయటంతో చాలామంది గ్రామీణ విద్యార్థులు అక్కడ చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.
బోధన సిబ్బంది కొరత..!
ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను గతేడాది అతిథి అధ్యాపకులతో భర్తీ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు అతిథి అధ్యాపకుల నియామకాలకు సంబంధించిన ఊసే లేదు. ఇంటర్ బోర్డు నుంచి అనుమతి రాకపోవటంతో ఖాళీలను భర్తీ చేయలేదు. గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రతి సంవత్సరం అతిథి అధ్యాపకులను కొనసాగిస్తుంటారు. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం నియామకాలకు సంబంధించి స్పష్టత లేక గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకునే వరకు సెప్టెంబరు, అక్టోబరు అవుతుంది. అందుకే విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి కనబరచటం లేదు.
మౌలిక వసతులు కరవు...
ప్రభుత్వ కళాశాలల్లో శౌచాలయాలు, తాగునీరు ఇతర సౌకర్యాల కోసం నిధులు మంజూరు కావడం లేదు. ఇటీవల ఉభయ జిల్లాల్లోని అన్ని కళాశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే విషయం గురించి న్యాయమూర్తులు సందర్శించి నివేదికలు అందజేశారు. కళాశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు లేరు.ప్రభుత్వ కళాశాలల్లో ప్రస్తుతం ప్రవేశాలు తక్కువగా ఉన్నాయి. వీటిని పెంచేందుకు కృషి చేస్తాం. గురుకుల జూనియర్ కళాశాలల ప్రభావం ప్రవేశాలపై పడింది. ఈనెల 25 వరకు గడువు ఉన్నందున చేరికల సంఖ్య పెరుగుందని భావిస్తున్నాం.
కె.రవిబాబు, డీఐఈఓ, ఖమ్మం

# ఇన్‌ఛార్జిల పురంపర..!




ఖమ్మం : బల్దియాల్లో అధికారుల కొరత వేధిస్తోంది. ఒక్కొక్కరు రెండు, మూడు చోట్ల అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుండటంతో పాలన కుంటుపడుతోందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలంగా ప్రధాన విభాగాలనూ ఇన్‌ఛార్జిలే పర్యవేక్షిస్తున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చినవారు కొన్ని విభాగాల్లో విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. పట్టణాల్లో కొన్ని సమస్యలు నెలలు తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.
అక్కడా.. ఇక్కడా..సత్తుపల్లి పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ ఏడాది క్రితం బదిలీ కాగా నాటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా ఒకరిని నియమించి పనిచేయిస్తున్నారు. జూనియర్ అకౌంటెంట్ స్వప్న వైరా మున్సిపాలిటీలోనూ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వారానికి రెండు రోజుల చొప్పున అక్కడా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత జనాభాకు 136 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం. 97 మంది మాత్రమే పనిచేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
ఇద్దరంటే ఇద్దరే
మధిర పురపాలికలో మేనేజర్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. కమిషనర్ నుంచి పట్టణ ప్రణాళికా అధికారి, శానిటరీ పర్యవేక్షకులు, మెప్మా ఏపీఎం, పురపాలక ఏఈ వంటి ప్రధాన పోస్టులకు ఇన్‌ఛార్జి అధికారులే దిక్కు. ఇటీవల ఎనిమిది మంది వీఆర్ఓలను ఇంటి పన్నుల వసూలుకు నియమించారు. సిబ్బంది కొరతతో పౌరసేవల్లో జాప్యం జరుగుతోంది. ఈవిషయంపై మధిర పుర కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ ఖాళీ పోస్టుల వివరాలను పాలకవర్గం ద్వారా ప్రభుత్వానికి నివేదించామన్నారు.
సేవలు అంతంతే
వైరా పురపాలికగా ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా కీలక పోస్టులకు ఇన్‌ఛార్జులే కొనసాగుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి పోస్టును ఆరంభం నుంచి భర్తీ చేయటం లేదు. ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చే కీలకమైన పోస్టులో రెగ్యులర్ అధికారి లేరు. ఖమ్మం కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారి ఇక్కడ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. వారానికి రెండురోజులు వచ్చివెళ్తున్నారు. నిర్మాణ అనుమతులతో పాటు ఇతర పనులు కుంటుపడుతున్నాయి. అకౌంటెంట్‌గానూ ఇన్‌ఛార్జి అధికారి పనిచేస్తున్నారు. సత్తుపల్లిలో విధులు నిర్వర్తించే ఈ అధికారి.. వైరాకు వారానికి ఒకట్రెండు రోజులు మాత్రమే వస్తున్నారు. కీలకమైన ఆర్థిక వనరులు చూసే పోస్టుకూ రెగ్యులర్ అధికారి లేరు. ఇక్కడ మేనేజర్ పోస్టులో నియమితులైన మరో అధికారి మధిర కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వరకు తాత్కాలిక కమిషనర్లు విధులు నిర్వర్తించారు. నెల క్రితం నూతన అధికారి వచ్చినా ఆయన పోస్టు స్థానికంగా మంజూరు కాలేదు. జనరల్ ఫండ్ నుంచి వేతనం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# భక్తులు మెచ్చేలా.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..!

భద్రాచలం : భద్రాచలం రామాలయ దర్శనానికి వచ్చే భక్తులకు సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులు సంకల్పించారు. ఇప్పటికే ఆలయ సమీపంలోని ఖాళీ స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇవి పూర్తయితే ఈ దివ్యక్షేత్ర శోభ మరింత పెరగనుంది. ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పర్ణశాల అభివృద్ధికీ ఆస్కారం ఏర్పడింది. ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) కార్యక్రమం కింద రూ.92.04కోట్లు అవసరమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రతిపాదించగా తొలి విడతలో రూ.41.38 కోట్లు మంజూరయ్యాయి. ఈపనులకు సంబంధించిన శిలాఫలకాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము గతేడాది డిసెంబరులో వర్చువల్ విధానంలో ప్రారంభించారు.
ప్రస్తుతం జరుగుతున్న పనులు..
రామాలయ పరిసరాల్లో రెండెకరాల స్థలాన్ని పర్యాటక విభాగానికి రెవెన్యూ శాఖ అప్పగించింది. ఇక్కడ జీ౦1 పద్ధతిలో అధునాతన హంగులతో భవన నిర్మాణానికి పునాదులు తవ్వారు. ఇక్కడ విశాలమైన గదులు, ప్రసాదాల కౌంటర్లు, వెయిటింగ్ హాళ్లు, పార్కింగ్ స్థలం, రెండువైపులా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ కంట్రోల్ విభాగం, విరాట మండపం, డైనింగ్ హాల్, కేశఖండన శాల, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ప్రథమ చికిత్స విభాగం, క్లాక్ రూం, ఫలహార శాల, గ్రంథాలయం నిర్మించనున్నారు. పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వనున్నారు.
చేపట్టాల్సినవి..
రెవెన్యూ అతిథిగృహం నుంచి కరకట్ట కిందిభాగం గుండా పర్యాటక విభాగం చేపట్టిన పనుల వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు. షెల్టర్లు ఏర్పాటుచేసి యాత్రికులు సేద తీరేందుకు బల్లలు సమకూర్చనున్నారు. హరిత హోటల్ నుంచి రామాలయం వరకు ఇదే తరహా ఏర్పాట్లు చేస్తారు. ప్రధానాలయం వద్ద మాడవీధుల విస్తరణ, విద్యుద్దీపాలు, వ్రత మండపం, రూఫింగ్, ఫ్లోరింగ్, బారికేడ్ల



నిర్మాణానికి నిధులు కేటాయించారు. బ్యాటరీ ద్వారా నడిచే కార్లను తిప్పనున్నారు. కోవెల పరిసరాల్లో అప్రోచ్ దారులు, శిల్ప కళా సౌందర్యం ఉట్టిపడేలా స్వాగత ద్వారాలు, నడక మార్గానికి అందాన్నిచ్చే లైటింగ్, కరకట్ట వైపు బయో టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే సదుపాయం, నదీ విహార ఏర్పాట్లు చేయనున్నారు. పట్టణ ప్రవేశం వద్ద సీసీ టీవీ వ్యవస్థ, స్వాగత ద్వారం ఉండనున్నాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల సమీపంలోని సీతవాగు వద్ద విద్యుద్దీపాలు, క్యూలైన్లు, ఫ్లోరింగ్, బయో టాయిలెట్లు నిర్మిస్తారు. గోదావరిలో బోట్ షికారు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, దుకాణాలు, షెల్టర్లను ఏర్పాటు చేయనున్నారు. భద్రాచలం, పర్ణశాలలో సిగ్నల్ లైట్లు, సమాచార బోర్డులు అమర్చనున్నారు. ఎంపిక చేసిన చోట సౌరశక్తిని ఉపయోగిస్తారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి పర్యాటకులను ఆకట్టుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

# బినామీలే అధికం

జగిత్యాల : రోడ్డు పక్కన చిన్నాచితకా వ్యాపారాలతో వీధివ్యాపారులు ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. మరోవైపు వీరి కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు సైతం పెరగడంతో వీధివ్యాపారులకు శాశ్వత షెడ్ల సౌకర్యం కల్పించాలని పురపాలక శాఖ భావించింది. ఇందుకు సౌలభ్యంగా ఉన్న రహదారుల్లో బల్దియా రెండేళ్ల క్రితం షెడ్ల నిర్మాణం చేపట్టింది. పట్టణంలో గొల్లపల్లిరోడ్డు వైపు 37 దుకాణాలు, శ్రీరామా థియేటర్ ఎదుట 9, అంగడిబజార్‌లో 20 షెడ్లను రూ.45 లక్షలతో నిర్మిస్తోంది. ఒక్కో పనిని రూ.15 లక్షల చొప్పున విభజించి గుత్తేదార్లకు అప్పగించారు. గొల్లపల్లి రోడ్డువైపు షెడ్లకు ఏడాదిన్నరపైనే పట్టింది. రామా థియేటర్, అంగడిబజార్‌లో ఇంకా పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణంలో తీవ్రమైన జాప్యంతో పాటు నాణ్యత లోపించిందని వీధివ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాకేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టిన సర్వేలో మొత్తం 6207 వీధి వ్యాపారులున్నారు. ఇందులో ప్రధానంగా ఏళ్ల తరబడి ఒకేచోట రహదారులపై చిరువ్యాపారులు చేసేవారు 300పైనే ఉంటారు. నిర్మించిన షెడ్లు 100 లోపే ఉన్నాయి. గొల్లపల్లిరోడ్డులో గతంలో ఉన్నవారికే ప్రాధాన్యతనిచ్చి కేటాయింపులు చేపడతామన్న అధికారులు గుట్టుచప్పుడు కాకుండా 29 షెడ్లను అప్పజెప్పారు. మిగిలినవాటిని సైతం అక్రమ పద్ధతిలో కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంజూరు చేసిన షెడ్లలో యజమానులు నిర్వహించకుండా వాటిని కొందరు నిబంధనలకు



విరుద్ధంగా అద్దెకు ఇస్తున్నారు. వీటిపై పురపాలక, మెప్మా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంలేదు. దీంతో అర్హులకు అందాల్సిన షెడ్లు ఆరంభంలోనే ఇతరులకు చిక్కడంతో మిగిలినవాటిపై కూడా దళారులు కన్నేశారు. షెడ్ల కేటాయింపులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు అధికారులతో కుమ్మక్కై అర్హులకు మొండిచేయి చూపారు.
రోడ్డుపైనే అమ్మకాలు
జిల్లాకేంద్రంలో అవసరం మేరకు షెడ్ల నిర్మాణానికి స్థలమున్నప్పటికీ కేవలం కొన్నిచోట్లనే నిర్మించారు. గుర్తింపుకార్డు కలిగిన వీధివ్యాపారులు వందల సంఖ్యలో రోడ్లపైనే నిత్యం ఎండకు, వానకు తామున్నచోటనే కష్టాలు అనుభవిస్తున్నారు. యావర్‌రోడ్డులో కేవలం గద్దెలు నిర్మించి వదిలేశారు. పార్కు వద్ద సౌకర్యంగా ఉన్నా ఇక్కడ షెడ్లు నిర్మించలేదు. పాతబస్టాండు కూడలి, జంబిగద్దె, యావర్‌రోడ్డు, కొత్తబస్టాండు కూడలి తదితర ప్రాంతాల్లో నిత్యం వీధివ్యాపారులు తమ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఇలాంటివారికి మెప్మా, పురపాలక సంఘం అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి భరోసా కల్పించలేకపోయారు. కనీసం షెడ్లకు సంబంధించి పూర్తి అవగాహన సైతం వీధి వ్యాపారులకు కల్పించలేకపోయారు. కనీసం త్వరలో కేటాయించనున్న షెడ్లనైనా గుర్తింపుకార్డు కలిగిన అర్హులకు కేటాయించాలని వీధివ్యాపారులు కోరుతున్నారు.
అక్రమాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు
శ్రీనివాస్, మెప్మా అధికారి
పట్టణంలో షెడ్ల కేటాయింపులో అర్హులకే అవకాశం కల్పించాం. యజమానులు కాకుండా ఇతరులు షెడ్లలో ఉండేందుకు అవకాశం లేదు. ఎవరైనా ఉంటే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలోనే అన్ని షెడ్లను నిబంధనల మేరకు కేటాయిస్తాం.

# వరంగల్ రహదారికి మహర్దశ

కరీంనగర్ : ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. కరీంనగర్-వరంగల్ రహదారికి మహర్దశ రానుంది. 563వ నంబరు జాతీయ రహదారి నాలుగు వరుసలుగా మార్చే పనులు ప్రారంభించేందుకు ఈనెల 8న ప్రధాని నరేంద్రమోదీ వరంగల్‌కు వస్తున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతోపాటు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి వినతులు అందించారు. ఆరు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డు కోసం రూ.2,146 కోట్లు విడుదల చేసింది. అప్పటినుంచి భూసేకరణ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. దాదాపు 60 శాతానికిపైగా ప్రక్రియ పూర్తికాగా సంబంధిత భూనిర్వాసితులకు రైతులకు పరిహారం అందుతోంది.
ప్రమాదాలకు అడ్డుకట్ట..
కరీంనగర్-వరంగల్ రహదారికి అధిక ప్రమాదాలు జరిగే మార్గంగా పేరొందింది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతుంటాయి. ఎందరో ప్రాణాలు కోల్పోగా.. చాలామంది క్షతగాత్రులయ్యారు. అధిక మూలమలుపులు ఉన్న రోడ్డు ఇది. ప్రమాదాల నివారణకు పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా అడ్డుకట్ట పడలేదు. రోడ్డు వెడల్పు చిన్నగా ఉండటం వేలాది వాహనాలు రాకపోకలను సాగిస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సగటున నెలకు 40కిపైగా ప్రమాదాలు జరిగే ఈ మార్గాన్ని విస్తరించాలనే ప్రతిపాదనకు సర్కారు ఆమోదించింది. కరీంనగర్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 30 గ్రామాలకు ఈ దారి విస్తరణతో మేలు జరగనుంది. కరీంనగర్ జిల్లా పరిధిలో 46.24 కి.మీ, హనుమకొండ జిల్లా పరిధిలో 21.77 కి.మీ కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నారు. పాత రోడ్డు 66.79 హెక్టార్లలో ఉండగా కొత్తగా 258.33 హెక్టార్లు సేకరిస్తున్నారు. మొత్తం నాలుగు వరుసల రహదారికి ఏకంగా 325.12 హెక్టార్ల భూమిని వినియోగించనున్నారు.
ఐదు బాహ్య వలయదారులు..
మానకొండూర్, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి సమీపంలో ఐదు బైపాస్‌లు నిర్మించనున్నారు. మొత్తం రోడ్డులో దాదాపు 45 కి.మీ మేర ఈ బాహ్యవలయ రహదారి ఏర్పాటుకానుంది. ఈ మార్గాన్ని 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో నిర్మించబోతున్నారు. ఈ మార్గం వెంబడి అధునాతన వసతులు కల్పించనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు రోడ్డు పక్కన నిలిపేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్గాన్ని తొందరగా పూర్తి చేస్తే ప్రయాణం మరింత సులభతరమవుతుంది. రెండు చోట్ల ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి), ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి)లు నిర్మించనున్నారు. కల్వర్టులు చిన్నపాటి వంతెనలు పలు చోట్ల ఏర్పాటు చేయబోతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో ఈ రోడ్డును పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు.




# ఝార్ఖండ్ సీఎంగా చంపయీ సోరెన్ ప్రమాణం

రాంచీ: రాజకీయ వేడి రాజుకున్న ఝార్ఖండ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత చంపయీ సోరెన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో జరిగిన వేడుకలో గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ నేత అలంగీర్ ఆలం, ఆర్జేడీ ఎమ్మెల్యే సత్యానంద్ భోక్తా మంత్రులుగా ప్రమాణం చేశారు. త్వరలోనే అసెంబ్లీలో బలపరీక్ష జరగనుంది. మనీలాండరింగ్ కేసులో జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌పై ఈడీ విచారణ నేపథ్యంలో.. గత రెండు రోజులుగా ఝార?ండ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. జనవరి 31న హేమంత్‌ను ఈడీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఆ వెంటనే ఆయన సీఎం పదవికి రాజీనామా చేయడం.. కొత్త ముఖ్యమంత్రిగా చంపయీని ఎన్నుకోవడం, ఆ తర్వాత హేమంత్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయడం చకాచకా జరిగిపోయాయి. ఆ తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటుపైనా కొన్ని గంటల పాటు సందిగ్ధం నెలకొంది. చివరకు చంపయీ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు గురువారం అర్ధరాత్రి గవర్నర్ నుంచి నిర్ణయం వెలువడింది. 10 రోజుల్లోగా అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ఆదేశించారు. 81 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఝార?ండ్ శాసనసభలో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ కూటమికి 48 మంది సభ్యుల బలం ఉంది.

**హైదరాబాద్‌కు ఎమ్మెల్యేల తరలింపు..** బలపరీక్ష నేపథ్యంలో సంకీర్ణ కూటమి తమ సభ్యులను కాపాడుకునేందుకు సిద్ధమైంది. కొంతమంది ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి గురువారమే వీరు హైదరాబాద్ చేరుకోవాల్సి ఉండగా.. వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు.




హైదరాబాద్ : సమాజంలో చెడును నిర్మూలించడానికి పోలీసులు ఎంతో కష్టపడుతూ ఉంటారు. డ్రగ్స్, గంజాయి ఇలా ఎన్నో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపేందుకు తమవంతు ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇంత చేసినప్పటికీ ఎక్కడో ఒక చోట గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్న ఘటనలు పోలీసులకు పెను సవాల్‌ను విసురుతూనే ఉన్నాయి. అయితే గంజాయి బ్యాచ్‌ను పట్టుకోవాల్సిన పోలీసులే ఆ వ్యాపారానికి పాల్పడితే?... ఖాకీ దుస్తులు ధరించి ఇలాంటి నీచమైన పనులకు దిగితే?... ఇలాంటి ఘటనే తెలంగాణలో చోటు చేసుకుంది. ఖాకీ వృత్తిలో ఉంటూ గంజాయి దందాకు తెరతీశారు ఇద్దరు ఏపీ పోలీసులు.. రహస్యంగా గంజాయి తరలించేందుకు యత్నించి చివరకు పక్క రాష్ట్ర పోలీసులకు చిక్కారు ఆ ఖాకీలు.

**అసలేం జరిగిందంటే?..** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పోలీసులు గంజాయి అమ్ముతూ తెలంగాణ పోలీసులకు చిక్కారు. ఈరోజు బాచుపల్లిలో గంజాయి అమ్మడానికి ఇద్దరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌వోటీ బాలానగర్ పోలీసులు ఓ వాహనాన్ని పట్టుకున్నారు. AP 39 QH 1763 నెంబర్ గల మారుతీ ఈసీవో వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా.. 11 పాకెట్స్‌లో 22 కేజీల గంజాయి పట్టుబడింది. వాటి విలువ రూ.8 లక్షలు. గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. వారి వివరాలు తెలిసి పోలీసులు షాక్‌కు గురవ్వాల్సి వచ్చింది. పట్టుబడిని ఇద్దరు వ్యక్తులు ఏపీ పోలీసులుగా గుర్తించారు. ఏపీ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా కాకినాడలోని థర్డ్ బెటాలియన్ ఏపీఎస్పీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ సాగర్ పట్నాయక్( 35) , కానిస్టేబుల్ శ్రీనివాస్ (32 ) అని తెలిసింది. గంజాయి స్మగింగ్‌తో పెద్ద ఎత్తున్న డబ్బు సంపాదించవచ్చనే ఆశతో సదరు ఖాకీలు ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఆరోగ్యం బాగోలేదని వంకతో డ్యూటీకి సెలవు పెట్టి మరీ మొదటిసారి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటన ఏపీ పోలీస్‌శాఖలో దుమారాన్ని రేపింది. పోలీసన్నా... ఇదేం పని అన్నా అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.




## రూ.29కే కిలో బియ్యం.. వచ్చే వారం నుంచి 'భారత్ రైస్' విక్రయాలు

దిల్లీ: బహిరంగ మార్కెట్లో భారీగా పెరిగిన బియ్యం ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. భారత్ రైస్ పేరుతో బియ్యాన్ని విక్రయించనుంది. కిలో రూ.29 చొప్పున అమ్మకాలు చేపట్టనుంది. వచ్చే వారం నుంచి విక్రయాలు ప్రారంభించనున్నట్లు ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా విలేకరుల సమావేశంలో శుక్రవారం వెల్లడించారు. దేశంలో బియ్యం ధరలు భారీగా పెరిగిన వేళ మధ్యతరగతికి ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. బియ్యం ఎగుమతులపై నిషేధం విధించినప్పటికీ ధరలు 15 శాతం మేర పెరిగాయని చోప్రా అన్నారు. నేషనల్ అగ్రికల్చర్ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, నేషనల్ కోపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కేంద్రీయ భండార్ రిటైల్ కేంద్రాల్లో బియ్యాన్ని విక్రయిస్తామని వెల్లడించారు. ఇ-కామర్స్ వేదికగానూ భారత్ రైస్ లభిస్తుందన్నారు. 5 కేజీలు, 10 కేజీల బ్యాగుల్లో 'భారత్ రైస్' అందుబాటులో ఉంటుందని చోప్రా తెలిపారు. రిటైల్ మార్కెట్లో తొలి దశలో ఐదు లక్షల టన్నుల బియ్యాన్ని విక్రయించాలని కేంద్రం నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే భారత్ గోధుమపిండి కిలో రూ.27.50, భారత్ దాల్ (శనగ పప్పు)ను రూ.60 చొప్పున కేంద్రం విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. బియ్యం ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేస్తారంటూ వస్తున్న వార్తలపై చోప్రా స్పందించారు. ధరలు అదుపులోకి వచ్చేంత వరకు నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలాగే, రిటైలర్లు, హోల్‌సేలర్లు, ప్రాసెసర్లు ప్రతి శుక్రవారం స్టాక్ వివరాలను మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిల్వలపై పరిమితి విధించబోతున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా... అవసరమైతే ఏ నిర్ణయమైనా తీసుకునే అవకాశంఉంది అని ముక్తసరిగా చెప్పారు. దేశంలో బియ్యం తప్ప మిగిలిన అన్ని నిత్యావసరాల ధరలు అదుపులో ఉన్నాయన్నారు.

# సిద్ధం సభకు ఎమ్మెల్యే వసంత దూరం..



అమరావతి: వైసీపీ ఎన్నికల శంఖారావం బహిరంగసభ 'సిద్ధం'కు ఏలూరు ముస్తాబువుతోంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కేడర్‌ను సభకు తరలించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఏలూరులో రేపు జరిగే సిద్ధం సభకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ హ్యాండ్ ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. తాను సభకు రానని కృష్ణప్రసాద్ స్పష్టం చేశారని సమాచారం. జనసమీకరణ కూడా తాను చేయబోనని వసంత చెప్పారు. వైసీపీ హైకమాండ్‌తో సైతం ఆయన అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. మైలవరంలో జన సమీకరణ బాధ్యతలను ఎంపీ కేశినేని నానికి వైసీపీ అప్పజెప్పింది. త్వరలోనే వసంత వైసీపీకి గుడ్ బై చెబుతారని సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం ఉన్నప్పటికీ అభివృద్ధి లేదని ఇటీవలే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఆస్తులు అమ్ముకుంటున్నారని చెప్పారు. త్వరలో టీడీపీలో వసంత చేరుతారని ప్రచారం జరుగుతోంది.




మంత్రి రోజాకు అనూహ్య ఘటన ఎదురైంది. తిరుమల వేదికగా అమరావతి నినాదాలు వినిపించాయి. మంత్రి రోజా శ్రీవారి దర్శనం చేసుకొనేందుకు తిరుమల వచ్చారు. దర్శనం తరువాత తిరిగి ఆలయం బయటకు వచ్చిన సమయంలో శ్రీవారి సేవకులుగా ఉన్న కొందరు అమరావతి అనుకూల నినాదాలు చేసారు. చేశారు. జై అమరావతి అని నినదించాలంటూ రోజాను శ్రీవారి సేవకులు కోరారు. దీంతో షాక్ అయిన రోజా శ్రీవారి సేవకు వచ్చి ఇదేంటి అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏపీలో ఎన్నికల వేళ తిరుమలలో అమరావతి అనుకూల నినాదాలతో మంత్రి రోజాను అడ్డుకొనే ప్రయత్నం జరిగింది. మంత్రి రోజా తరచూ శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తరువాత మంత్రి రోజా కు చేదు అనుభవం ఎదురైంది. స్వామి వారి దర్శనం చేసుకొని ఆలయం వెలుపలకు వచ్చిన రోజా వద్ద "జై అమరావతి" అంటూ శ్రీవారి సేవకులు నినాదాలు చేశారు. జై అమరావతి అని నినదించాలంటూ రోజాను శ్రీవారి సేవకులు కోరారు. శ్రీవారి సేవకు వచ్చి ఇదేంటంటూ మంత్రి రోజా వెళ్లిపోయారు. అయితే, శ్రీవారి సేవకులుగా ఉంటూ ఆలయ సమీపంలో ఈ నినాదాల పైన అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. శ్రీవారి సేవకులుగా అమరావతి ప్రాంతానికి చెందిన వారు ఈ నినాదాలు చేసినట్లు చెబుతున్నారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల వ్యవహారం తెర మీదకు వచ్చింది. ప్రస్తుతం ఈ వివాదం సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. ఎన్నికల వేళ మూడు రాజధానుల వ్యవహారం రాజకీయ అంశంగా మారే అవకాశం కనిపిస్తోంది. అయితే, అనూహ్యంగా తిరుమల వేదికగా అమరావతి నినాదాలు చేయటంతో మరోసారి ఈ అంశం వివాదాస్పదంగా మారుతోంది. దీని పైన టీటీడీ అధికారులు స్పందించాల్సి ఉంది.



## టీడీపీ నేత గోగుల వెంకట రమణ వైయస్‌ఆర్‌సీపీలో చేరిక

తాడేపల్లి: విజయవాడలో టీడీపీకి మరో భారీ షాక్ తగిలింది. టీడీపీ నేత, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణ సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అధినేత, సీఎం వైయస్ జగన్ వెంకటరమణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), తదితరులు పాల్గొన్నారు.




**దిల్లీలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కలిశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఆమె వెంట కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, జేడీ శీలం, తులసిరెడ్డి, మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ తదితరులు ఉన్నారు.**

# ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై అరెస్టు వారెంట్



విజయవాడ: గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై విజయవాడ ప్రతినిధుల కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రసాదంపాడులోని ఓ పోలింగ్ బూత్ వద్ద జరిగిన ఘటనలో.. మొత్తం 38 మందిపై పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. కేసు విచారణకు కోర్టుకు హాజరుకాకపోవటంతో బెయిలబుల్ వారెంట్‌ను గత విచారణలోనే న్యాయస్థానం జారీ చేసింది. ఇవాల్టి విచారణకూ హాజరుకాకపోవటంతో వారెంట్ అమలు చేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది.

# అన్యమతస్థ భక్తులకు టీటీడీ గుడ్‌న్యూస్



తిరుమల, ఫిబ్రవరి 2: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారిని ప్రతిరోజు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో వెంకన్న సన్నిధి కళకళలాడుతూ ఉంటుంది. హిందూ భక్తులతో పాటు అన్యమతస్థ భక్తులు కూడా స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే దీనికి ఓ ప్రొసీజర్ ఫాలో అవ్వాల్సి ఉంటుంది. తిరుమలకు వచ్చే హిందూయేతరులు.. "మాకు శ్రీవారిపై సంపూర్ణ నమ్మకం ఉంది" అంటూ డిక్లరేషన్ సమర్పించి స్వామి వారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. అయితే శ్రీవారి సేవలో పాల్గొంటామంటూ ఇటీవల అన్యమతస్థ భక్తుల నుంచి టీటీడీకి విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. వెంకన్న సేవలో పాల్గొనే అవకాశం ఇవ్వాలని తిరుమల తిరుపతి దేవస్థానాన్ని హిందూయేతర భక్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అన్యమతస్థ భక్తులకు టీటీడీ శుభవార్త చెప్పింది.

**త్వరలోనే అనుమతి...** త్వరలోనే ఆఫ్‌లైన్‌లో అన్యమతస్థ భక్తులను శ్రీవారి సేవకు అనుమతిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రకటించారు. వారిని శ్రీనివాసుడి దర్శనానికి అనుమతించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సెక్యూరిటీ విభాగం సూచనల మేరకు హిందూయేతరులను శ్రీవారి సేవకు అనుమతించడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. చాలా మంది ఇతర మతస్థులు వెంకన్నకు సేవ చేసేందుకు అనుమతివ్వాలని టీటీడీకి విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. ఓ కమిటీని నియమించి వారీ సూచనల మేరకు అన్యమతస్థులను శ్రీవారి సేవకు అనుమతించడంపై నిర్ణయం తీసుకుంటామని టీటీడీ ఈవో తెలిపారు.

**జనవరిలో శ్రీవారి హుండీ ఆదాయం ఎంతంటే?..** పర్యావరణ పరిరక్షణలో భాగంగా నూతనంగా క్యూ కాంప్లెక్స్‌లను నిర్మించామన్నారు. శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉండకుండా స్లాట్ ద్వారా భక్తులకు దర్శనం టోకెన్లను జారీ చేస్తామని చెప్పారు. జనవరి మాసంలో 21 లక్షల 09 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. హుండీ ద్వారా రూ. 116.46 కోట్ల ఆదాయం లభించిందని తెలిపారు. కోటి 3 లక్షల లడ్డులను భక్తులకు విక్రయించామని.. 46 లక్షల 46 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశామన్నారు. 7 లక్షల 5వేల మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారన్నారు. రేపటి (శనివారం) నుంచి మూడు రోజుల పాటు ధార్మిక సదస్సుని నిర్వహిస్తున్నామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.

# అనుష్క మళ్లీ బ్యాక్ స్టెప్..!

స్వీటీ అనుష్క సినీ కెరీర్ పై ఆమె ఫ్యాన్స్ పెద్ద ఆందోళనే పెట్టుకున్నారు. నిశ్శబ్ధం తర్వాత 3 ఏళ్లు గ్యాప్ ఇచ్చిన అనుష్క లాస్ట్ ఇయర్ మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టితో అలరించింది. ఈ సినిమాలో అనుష్క ని చూసి ఆమె అభిమానులంతా కూడా ఖుషి అయ్యారు. ఆ సినిమా సక్సెస్ తర్వాత అయినా అనుష్క మళ్లీ వరుస సినిమాలు చేస్తుందని అనుకున్నారు. కానీ అలా చేస్తే ఆమె అనుష్క ఎందుకు అవుతుంది అలా చేయట్లేదు. అనుష్క మళ్లీ సినిమాల విషయంలో బ్యాక్ స్టెప్ వేస్తుంది. కేవలం తన లుక్ విషయంలో అభిమానులను అసంతృప్తి పరచకనే అనుష్క సినిమాలకు దూరంగా ఉంటుందా అంటే అదొక్కటే కారణమని చెప్పడం కష్టమని చెప్పొచ్చు. అభినామ నటి ఎలా ఉన్నా ఫ్యాన్స్ యాక్సెప్ట్ చేస్తారు. కానీ అనుష్క సినిమాలు చేయకపోవడానికి మరో రీజన్ ఏదైనా ఉండి ఉండాలి. లేటెస్ట్ గా మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న విశ్వంభర సినిమాలో నటిస్తుందని వార్తలు వచ్చాయి. అయితే సినిమా షూటింగ్ మొదలైనా సరే అనుష్క సెట్స్ కి ఇంకా రాలేదు. దానికి ఇంకా టైం ఉందని తెలుస్తున్నా చివరి నిమిషంలో అనుష్క ఎక్కడ ఆ సినిమా కాదంటుందో అని ఫ్యాన్స్



టెన్షన్ పడుతున్నారు. అయితే ఆ సినిమా నిర్మాతలు యువి క్రియేషన్స్ కాబట్టి అనుష్క కాదనే ఛాన్స్ లేదు. మరోపక్క అనుష్కకు కథలు నచ్చకనే సినిమాలు చేయట్లేదని కొందరు అంటున్నారు. దాదాపు 3, 4 ఏళ్లలో అనుష్క మనసుకి నచ్చిన కథ ఒక్కటి కూడా రాలెదా అని అంటున్నారు. ఏది ఏమైనా సినిమాల విషయంలో అనుష్క వ్యవహరిస్తున్న ఈ తీరు ఆడియన్స్ ని ఆకట్టుకోవట్లేదు. విశ్వంభర చేసి ఆ సినిమా హిట్ పడితే అయినా అనుష్క వరుస సినిమాలు చేస్తుందేమో చూడాలి. విశ్వంభర అనుష్కతో పాటు చెన్నై చిన్నది త్రిష కూడా నటిస్తుందని టాక్. అయితే ఇద్దరిలో ఒకరు మాత్రమే ఉంటారా ఇద్దరు భాగం అవుతారా అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ సినిమాలకు పూర్తిగా ఫుల్ స్టాప్ పెట్టి పర్సనల్ లైఫ్ లో ఏదైనా డెసిషన్ తీసుకుంటా అంటే అది కూడా లేదు. అనుష్క పెళ్లి ఎప్పుడంటూ మీడియా చేసే హడావిడి కూడా తెలిసిందే. అందుకే అమ్మడు మీడియా ముందుకు వచ్చేందుకు కూడా అంత ఆసక్తి చూపించట్లేదని తెలుస్తుంది.

## ఆ ఇద్దరు చేసిన తప్పు రుక్మిణి చేయకుండా ఉంటే బెటర్..!

కన్నడ నుంచి కొత్త హీరోయిన్ ఎంట్రీ ఇస్తుంది అంటే చాలు మన దర్శక నిర్మాతలంతా ఆమె వెంట క్యూ కడతారు. తెలుగు పరిశ్రమకు కన్నడ పరిశ్రమ నుంచి ఇప్పటికే చాలామంది హీరోయిన్స్ పరిచయం అయ్యారు. రీసెంట్ గా వచ్చిన రష్మిక మందన్న కూడా కన్నడ నుంచి వచ్చి టాలీవుడ్ లో స్టార్ క్రేజ్ తెచ్చుకుంది. అఫ్కోర్స్ ఇప్పుడు అమ్మడి క్రేజ్ బాలీవుడ్ కి పాకిందనుకోండి. ఇక ఆమె దారిలోనే ఇప్పుడు రుక్మిణి వసంత్ టాలీవుడ్ గ్రాండ్ ఎంట్రీ ఇస్తుంది. కన్నడలో తెరకెక్కిన సప్త సాగరాలు దాటి సినిమా హిట్ అందుకోవడంతో రుక్మిణి సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా తెలుగులో కూడా డబ్ అవ్వడంతో అమ్మడికి ఇక్కడ కూడా పాపులారిటీ వచ్చింది. తెలుగులో కూడా రుక్మిణికి ఒకటి రెండు ఆఫర్లు వచ్చినట్టు తెలుస్తుంది. మాస్ మహారాజ్ రవితేజతో సినిమాతో పాటు విజయ్ దేవరకొండతో మరో సినిమా ఉంటుందని తెలుస్తుంది. ఈమధ్యనే తెలుగు తెరకు పరిచయమై మొదటి రెండు సినిమాలు సక్సెస్ అందుకుని ఆ తర్వాత డీలా పడిన కృతి



శెట్టి, శ్రీలీల కెరీర్ లా రుక్మిణి కెరీర్ కాకూడదని చెబుతున్నారు. ఉప్పెనతో హిట్ అందుకున్న కృతి శెట్టి ఆ తర్వాత అరడజను సినిమా చేయగా ఒకటి రెండు తప్ప అన్నీ ఫ్లాప్ అవ్వగా అమ్మడిని పక్కన పెట్టేశారు. ఇక మరోపక్క ధమాకా హిట్ తో అదరగొట్టిన శ్రీ లీల కూడా వరుస స్టార్ ఛాన్స్ లు అందుకోగా అమ్మడికి కూడా వరుస ఫ్లాపులు షాక్ ఇచ్చాయి. ఒక్క హిట్ పడగానే కథల గురించి పట్టించుకోకుండా వీరిద్దరు వచ్చిన ప్రతి సినిమా చేస్తూ వచ్చారు. ఇప్పుడు రుక్మిణికి కూడా సప్త సాగరాలుతో వచ్చిన పాపులారిటీతో వరుస ఆఫర్లు ఇస్తున్నారు. కానీ అమ్మడు కథల విషయంలో జాగ్రత్త పడితే బెటర్ అని అంటున్నారు. ఎలాగు ముందు వారి ఫెయిల్యూర్స్ కనబడుతున్నాయి కాబట్టి రుక్మిణి సినిమాల విషయంలో ఆచితూచి అడుగులేస్తే ఆమె కెరీర్ కు ఉపయోగపడుతుందని చెప్పొచ్చు. అంతేకాదు టాలీవుడ్ ఆఫర్స్ వస్తున్నాయి కదా అని కన్నడ పరిశ్రమని లైట్ తీసుకోకుండా అక్కడ కూడా సినిమాలు చేస్తే ఒకవేళ ఇక్కడ కెరీర్ రిస్క్ లో పడినా కనీసం అక్కడైనా ఫాం కొనసాగించే ఛాన్స్ ఉంటుంది. మరి రుక్మిణి వసంత్ సినిమాలను ఎలా ఓకే చేస్తుంది.. ఆమె తెలుగు ఎంట్రీ ఎలా ఉంటుంది అన్నది తెలియాలంటే కొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే




# అందరి చూపు ఆగస్టు-15పైనే..కానీ ఆయన సైడిస్తాడా?




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న పాన్ ఇండియా చిత్రం పుష్ప-2ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లో ఆ తేదికి వచ్చేస్తామని గట్టిగానే చెబుతున్నారు. అంతకు మించి ఆలస్యం చేయడం తగదని భావిస్తోన్న టీమ్ ఆతేదికి వచ్చేలాగే షూట్ సహా పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేస్తుంది. ఈ సినిమాపై పాన్ ఇండియా వైడ్ ఎలాంటి అంచనాలున్నాయో చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ హిందీ బెల్ట్ లో చిత్రాన్ని భారీ ఎత్తున రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగం భారీ వసూళ్లలో అత్యధిక షేర్ అక్కడి నుంచే ఉండటంతో అక్కడ మార్కెట్ ని ఏ మాత్రం మిస్ చేయదలు చుకోలేదు. 1000 కోట్ల వసూళ్లు పుష్ప -2 కి సాధ్యమే అన్నది ట్రేడ్ సైతం అంచనా వేస్తుంది. పైగా ఆగస్టు 15కి వస్తే కొన్ని సెలవులు కూడా కలిసొస్తున్నాయి. అందుకే పుష్ప-2 రిలీజ్ని ఆ తేదికి ప్లాన్ చేసుకున్నారు. అయితే ఒకవేళ పుష్పరాజ్ గనుక సైడ్ ఇస్తే ఆ తేదీకి తెలుగు సహా చాలా సినిమాలు రిలీజ్ రేసులో కనిపి స్తున్నాయి. పుష్ప -2 ఆగస్టు నుంచి మరో నెలకి వాయిదా పడితే గనుక ఆరడజను సినిమాలు క్యూలో ఉన్నాయి. దేవర..సరిపోదా శనివారం.. ఇండియన్-2..కంగువా..వెట్టైయాన్ లాంటి సినిమాలు రిలీజ్ రేసులోకి ప్లాన్ చేసుకుంటున్నాయి. ఇప్పటికే రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ నుంచి సింగం ఎగైన్ ఆగస్టు 15న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. హిందీ మార్కెట్ టార్గెట్ గా రిలీజ్ అవుతున్న చిత్రమది. కాబట్టి పుష్ప-2తో వాళ్లకేం ఇబ్బంది లేదు. థియేటర్ల పరంగా ఇబ్బంది ఉండదు. కాబట్టి సింహం సింగిల్ గా వచ్చినా సమస్యేం లేదు. మిగతా సినిమాలే పుష-2 వాయితే పడితే బాగుండు.. ఆతేదికి బొమ్మ మేము వేసుకుంటాం? అన్న ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ సైడ్ ఇవ్వడం అంత ఈజీగా జరిగే పని కాదు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# అందమైన భామల మధ్య నలిగిపోయిన బ్రదర్స్!



లైవ్ కాన్సెర్ట్ లో భాగంగా జోనాస్ బ్రదర్స్ నిక్ జోనాస్, జో జోనాస్, కెవిన్ జోనాస్ ఇటీవల భారత్ కి విచ్చేసిన సంగతి తెలిసిందే. బ్రదర్స్ ఇద్దరు దిగ్విజయంగా ఆ ఈవెంట్ ని ముగించారు. అయితే ఈ సమయంలో వాళ్లతో పాటు నిక్ జోనాస్ భార్య..నటి ప్రియాంక చోప్రా మాత్రం రాలేదు. అయితే ఇక్కడ బ్రదర్స్ ఇద్దరికీ మాత్రం కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. పీసీ లేకపోయినా ఆమె లేని లోటు ఎక్కడా కనిపించకుండా తగిన చర్యలు తీసుకుంది. ఎయిర్ పోర్ట్ లో దిగిన దగ్గర నుంచి కచేరీ పూర్తయ్యేవరకూ పీసీ స్నేహితులు...ఆర్గనైజనర్లు అంతా దగ్గరుండి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకున్నారు. పీసీ వాళ్ల దగ్గర లేకపోయినా ఉన్నాను అనే ఫీలింగ్ తెచ్చేలా చేసింది. ఇక కచేరి అనంతరం అన్నదమ్ములిద్దరికి సత్కార కార్యక్రమం ఏర్పాటు చేయడం.. పలువురు సెలబ్రిటీలు ముంబైలో గ్రాండ్ గా పార్టీ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా బ్రదర్స్ ఇద్దర్నీ బాలీవుడ్ భామలంతా చుట్టుముట్టేసారు. ఇద్దరి మధ్యలోకి దూరి సెల్ఫీలు దిగడం..ఫోటో సెషల్ పాల్గొనడం ఆ రచ్చంతా మామూలుగా లేదు. కావాల్సినంత సమయం ఉండటం ..అందులోనూ పార్టీ సమయం కావడంతో జోనాస్ బ్రదర్స్ భామల మధ్యలో అంతే ఉత్సాహంతో పాల్గొన్నారు. భూమి పెడ్నేకర్- సుస్సానే ఖాన్- మలైకా అరోరా తదితరులు పాల్గొన్నారు. వాళ్లంతా నిక్ బ్రదర్స్ తో ఎంతో స్వేచ్ఛగా పార్టీని ఎంజాయ్ చేసినట్లు తెలుస్తుంది. భూమీ పడ్నేకర్..మలైకా అరోరా నిక్ ని హత్తుకుని మరీ ఫోటోలు దిగారు. అలాగే అదితి రావ్ హైదరీ ..నితాషా నందా ..సోనమ్ కపూర్.. ఆనంద్ అహుజా.. మాధురీ దీక్షిత్ ఎంతో అందంగా ముస్తాబై పార్టీకి హాజరయ్యారు. ప్రస్తుతం ఆ ఈవెంట్ కి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.నిక్ ని ఇలా చుట్టు ముట్టడంపై సొగసైన కామెంట్లు తెరపైకి వస్తున్నాయి. పీసీ ఇలా హబ్బీని ఒంటరిగా ఇండియాకి పంపిస్తే ఇలాగే ఉంటుంది. ఈసారి తప్పకుండా పీసీ నిక్ పక్కన లేకపోతే చాలా ప్రమాదాలే జరిగిపోతాయంటూ నెటి జనులు కామెంట్లు పెడుతున్నారు.

# 'ఫ్యామిలీ స్టార్' లో సీతమ్మ డాన్సులు చింపేస్తుందా!

ముంబై బ్యూటీ మృణాల్ టాలీవుడ్ లో జర్నీ ఎలా ఉందో చెప్పాల్సిన పనిలేదు. మూడు పువ్వులు..ఆరు కాయలుగా ఎంతో సంతోషంగా సాగిపోతుంది. కేవలం ప్రతిభతోనే అవకాశాలందుకుని ముందుకెళ్తుంది. ఇటీవలే 'హాయ్ నాన్న'తో మరో మంచి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. నటి పరంగా మృణాల్ నటనకు పేరు పెట్టాల్సిన పనిలేదు. ఆమె గ్రేట్ పెర్ఫార్మర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే మృణాల్ కి మనసులో ఉన్నకోరికలు కొన్ని ఇంకా తీరలేదు. అమ్మడు రొమాంటిక్ పాత్రల్లో నటించాలని ఎప్పటి నుంచో కోరుకుంటుంది. కానీ ఆ ఛాన్స్ రావడం లేదు. అలాంటి అవకాశం ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తుంది. ఈ విషయాన్ని ఎంతో ఓపెన్ గాను షేర్ చేసింది. మరి ఇలాంటి కోరికలు మృణాల్ మనసులో ఇంకేమైనా ఉన్నాయా? అంటే ఉన్నాయనే అంటోంది. హీరోలతో



కలిసి డాన్సులు ఇరగదీయడంలోనూ మందుండాలి అంటోంది. నేను సీరియస్ స్టోరీల్లో ఎక్కువగా నటించా. దాంతో ఊపేసే డాన్సులు చేసే అవకాశం ఎక్కడా రాలేదు. హృతిక్ రోషన్ తో కలిసి నటించిన సూపర్ 30 లోనూ ఆఛాన్స్ రాలేదు. అందుకు ఎంతో బాధపడ్డా. జెర్సీ విషయంలోనూ అదే జరిగింది. షాహిద్ కపూర్ తో కలిసి డాన్సు చేసే అవకాశం రాలేదు. అందుకే ఆయనతో కలిసి ఓ ఎంటర్ టైన్ మెంట్ సినిమా చేయాలనుకుంటున్నా. ఇలా నా సహ నటులంతా మంచి డాన్సర్లు అయినా నేను డాన్సు చేసే అవకాశం రావడం లేదు. అందుకే అలాంటి కోరకలు అన్నింటిని సోషల్ మీడియా ద్వారా తీర్చుకుంటున్నా. అయితే ఫ్యామిలీ స్టార్ ఆలోటును తీర్చేస్తుంది' అని అంది. అటే విజయ్ దేవరకొండ తో నటిస్తోన్న ఈ సినిమాలో మృణాల్ స్టెప్పులతనూ అలరిస్తుందని తెలుస్తుంది. అన్నట్లు మృణాల్ మంచి డాన్సర్ అన్న సంగతి తెలిసిందే. టీవీ రంగం నుంచి రావడంతోనే అమ్మడు నటనతో పాటు డాన్సులోనూ ఆరితేరింది.

## రాజమండ్రి రాగమంజరిలా జాన్వీకపూర్!

'రాజమండి రాగమజంరి మా అమ్మ పేరు తెలవనోళ్లు లేరు మేస్త్రీ... కళాకార్ల ఫ్యామిలీ మరి.. నే గజ్జె కడితే నిదురపోదు నిండు రాతిరి...సోకులాడి స్వప్న సుందరి.. నీ మడత చూపు మాపటేల మల్లె పందిరి..రచ్చ రాజుకుందే మోపిరి.. నీవంక చూస్తే గుండెలోనే డీరి డిరీ అన్న కుర్చీ మడత సాంగ్ అందుకోవాల్సిందే జాన్వీ కపూర్ ని ఇలా చూస్తుంటే. అమ్మడు ముస్తాబైన విధానం..పెర్ఫార్మెన్స్ తో అదే రేంజ్ లో అదరగొ ట్టినట్లు తెలుస్తోంది. 69వ ఫిల్మ్ ఫేర్ వేడుకల్లో భాగంగా బాలీవుడ్ బ్యూటీలంతా లైవ్ పెర్ఫార్మెన్స్ తో అలరించిన సంగతి తెలిసిందే. అందులో అంతిలోక సుందరి శ్రీదేవి స్వీట్ డాటర్ జాన్వీపూర్ కూడా స్టేజ్ పెర్ఫార్మెన్స్ ఇ చ్చింది. తనకు ఇష్టమైన పాటలన్నింటికీ డాన్సు చేసి అమ్మడు ఆకట్టుకుంది. వాటిలో నుంచి లీకైన ఈ స్టిల్ చూస్తుంటే రాజమండ్రి రాగమంజరి...కళాకార్ల ఫ్యామిలీనే తలపిస్తుంది మరి. టాప్ టూ బాటమ్ అమ్మడు ధరించిన



దుస్తుల్లో అంతే వేడి పుట్టిస్తున్నాయి. మిరుమిట్లు గొలిపే గులాబీ రంగు స్కర్ట్.. బ్లౌజ్ ప్రతీది జాన్వీలో మాస్ అప్పిరియన్స్ ని తీసుకొచ్చింది. అమ్మడి సిగ్నెచర్ స్టెప్పులు మాస్ బీట్ కి పర్ఫెక్ట్ గా మ్యాచ్ అయినట్లు కనిపిస్తుంది. ముఖంలో జాన్వీ ఎక్స్ ప్రెషన్స్..మూతి బిగింపు మాస్ లో విజిల్స్ వేయించేలా ఉంది. అయితే వేదికపై జాన్వీ బాలీవుడ్ ఐకానిక్ పాటలకు డాన్సు చేసి మెప్పించింది. ఈ ఫోటోని ఇన్ స్టాలో షేర్ చేసి తన అభిప్రాయాన్ని కూడా పంచుకుంది. నాకు చాలా ఇష్టమైన మరియు అత్యంత ప్రసిద్ధ హిందీ సినిమా క్వీన్స్ పాటలపై నృత్యం చేయడం నాకు ఎంత గొప్పగా..గర్వంగా అని పించింది. ఎంతటి గౌరవం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. జాన్వీ అభిమానులు చూసి అంతే ఆస్వాదిస్తున్నారు.




జారండ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా నేత చంపాయ్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ఎమ్మెల్యేలు ఈరోజు హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు ప్రత్యేక విమానాల్లో 43 మంది ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు తరలివచ్చారు. అయితే వీరు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా శామీర్‌పేట్‌లోని ఓ రిసార్ట్స్‌కు తరలించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఏర్పాట్లను చేస్తోంది. జారండ్ అసెంబ్లీలో బలపరీక్ష తేదీ ఖరారయ్యే వరకూ వీరంతా హైదరాబాద్ క్యాంపులోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ జార్ఖండ్ బాధ్యతలను తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జీ దీపా దాస్ మున్షి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్‌కు టీపీసీసీ అప్పగించింది. అయితే తమ ఎమ్మెల్యేలను ప్రతిపక్ష బీజేపీలోకి లాక్కునే అవకాశం ఉన్నందున తాము ఈ సమయంలో ఎటువంటి అవకాశాన్ని తీసుకోలేమని ఈ పార్టీకి చెందిన కీలక నేత చెప్పారు. JMM నేతృత్వంలోని ప్రభుత్వానికి 81 మంది సభ్యుల జార?ండ్ అసెంబ్లీలో 43 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది.




దిల్లీ: ఫాస్టాగ్‌ల ఈ – కేవైసీ పూర్తి చేసేందుకు గడువును మరో నెల రోజులు పొడిగిస్తూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 29 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. గడువు తేదీ తర్వాత కేవైసీ చేయని వాటిని డీయాక్టివేట్ చేస్తామని స్పష్టం చేసింది.

ఫాస్టాగ్ వెబ్‌సైట్‌తో పాటు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వెబ్‌సైట్ ద్వారా కేవైసీ చేసుకోవచ్చని తెలిపింది. అంతకుముందు జనవరి 31 వరకు గడువు విధించిన సంగతి తెలిసిందే.

**ఫాస్టాగ్ కేవైసీ ఇలా...** ఫాస్టాగ్ కేవైసీ స్టేటస్ తెలుసుకునేందుకు వెబ్‌సైట్‌ల లింక్‌పై క్లిక్ చేయాలి. మొబైల్ నంబర్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీ ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. డ్యాష్‌బోర్డులోకి వెళ్లి 'మై ప్రొఫైల్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

అక్కడ మీ కేవైసీ స్టేటస్ కనిపిస్తుంది. కేవైసీ పూర్తి కాకపోయి ఉంటే అడిగిన వివరాలు సమర్పించి ప్రాసెస్ చేయాలి. మొబైల్ నంబర్ ఎన్‌హెచ్‌ఏఐ వద్ద రిజిస్టర్ కాకుంటే.. 'మై ఫాస్టాగ్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో రిజిస్టర్ చేసుకోవాలి. బ్యాంకులు జారీ చేసిన ఫాస్టాగ్‌లు అయితే బ్రాంచ్‌కి వెళ్లి మొబైల్ నెంబర్ రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత కేవైసీ పూర్తి చేసుకోవాలి.

# మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి: సీఎం రేవంత్ రెడ్డి

ఇంద్రవెల్లి: మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేస్లాపూర్‌లోని నాగోబా దర్బార్‌లో స్వయం సహాయక సంఘాలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ రూ. 1200 ఉందని, త్వరలో మహిళలకు రూ. 500లకే ఇస్తామని తెలిపారు. స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే అవకాశం స్వయం సహాయక బృందాలకే కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ బిల్లులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్న సీఎం.. త్వరలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే భారాస నేతలకు కడుపునొప్పి ఎందుకని ప్రశ్నించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 1450 డ్వాక్రా సంఘాలకు సుమారు రూ. 60 కోట్లకుపైగా రుణాలు పంపిణీ చేశారు.

**నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు..** రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు.



బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కేస్లాపూర్ చేరుకున్న సీఎం.. ఆదివాసీల ఇలవేల్పు నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టార్గెట్ లోక్‌సభ ఎన్నికలు.. తెలంగాణ బీజేపీ అభ్యర్థుల జాబితా రెడీ?



హైదరాబాద్: దేశంలో సార్వత్రిక ఎన్నికల హడావిడీ నెలకొంది. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు రంగ సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్నికల రణక్షేత్రంలో దిగడానికి అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించాయి. ఈ క్రమంలో తెలంగాణలో ఎంపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో బీజేపీ ఓ అడుగు ముందుకేసినట్లు కనిపిస్తుంది. తెలంగాణ బీజేపీ ఎంపీ అభ్యర్థుల జాబితా సిద్ధం చేసిన రాష్ట్ర నాయకత్వం దీనిని.. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీకి జాబితా పంపినట్లు సమాచారం. మేజార్టీ స్థానాలను వచ్చే వారం ప్రకటించే అవకాశం ఉంది. తొలిజాబితాలో ఎనిమిది నుంచి 10 స్థానాల అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ కంటే ఇరువై రోజుల ముందే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని కాషాయ పార్టీ యోచిస్తోంది. సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాల్లో సిట్టింగ్‌లకే అవకాశం ఇచ్చేందుకు పార్టీ మొగ్గు చూపుతోంది. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్‌లను తిరిగి ఎంపీలుగా పోటీలో నిలపాలని నిర్ణయించింది. ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో ఇతర పార్టీల నుంచి బలమైన నేతలను తీసుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ఇక ఆదిలాబాద్‌లో కొత్త అభ్యర్థి కోసం అన్వేషణ ప్రారంభించింది. మహబూబ్ నగర్, చేవెళ్ల, భువనగిరి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థుల పేర్లు తొలి జాబితాలోనే ప్రకటించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ మరోసారి నిజస్వరూపం బయటపెట్టింది: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజలను మభ్యపెట్టడంలో ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ మరోసారి తెలంగాణ యువతను మోసం చేసిందని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. నిరుద్యోగ యువత కోసం ఫిబ్రవరి 1న గ్రూప్–1 నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల వాగ్దానంలో కాంగ్రెస్ పేర్కొందన్నారు. ఆ సమయం ఇప్పుడు దాటిపోయిందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "నిన్ననే ఒకటో తేదీ.. ఇది ఫిబ్రవరి నెలే. ఇంతవరకూ నో టిఫికేషన్ రాలేదు. నమ్మి ఓటేసిన యువతను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్టనిలువునా మోసం చేసింది. ఇదే తరహాలో ఇతర వాగ్దానాలనూ వ్యూహాత్మకంగా దాటవేసే ప్రయత్నం జరుగుతోంది" అని ఆరోపించారు.



# ఆ నిర్ణయంతో తెలంగాణకు తీవ్ర నష్టం: కేంద్రమంత్రిని కలిసిన భారాస ఎంపీలు




దిల్లీ: కృష్ణా నదిపై ఉన్న రెండు కీలక ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించడంపై భారాస ఎంపీలు నిరసన తెలిపారు. దిల్లీలో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను ఎంపీల బృందం కలిసింది. తమకున్న అభ్యంతరాలను తెలియజేస్తూ లేఖను అందజేశారు.

ఈ నిర్ణయంతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని.. వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కృష్ణా ట్రైబ్యునల్‌లో విచారణ పూర్తయ్యేవరకు ఇరు రాష్ట్రాలకు 50:50 పద్ధతిలో నీటి కేటాయింపులు ఉండేలా చూడాలని షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు.




# మల్కాజ్‌గిరి ఎంపీ సీటు కోసం బండ్ల గణేష్ దరఖాస్తు.. మల్లారెడ్డిని ఆటాడుకున్నారుగా!

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక టాలీవుడ్ నిర్మాత, కాంగ్రెస్ నేత బండ్ల గణేష్ స్వరం పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై.. ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు ఎవరైనా మాట్లాడితే చాలు.. నిమిషాల్లో మీడియా మీట్‌లు పెట్టేసి కౌంటర్లు ఇచ్చేస్తున్నారు. ఆ మధ్య మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన బండ్ల.. ఇప్పుడు ఎమ్మెల్యే మల్లారెడ్డిపై దుమారం రేపే వ్యాఖ్యలు చేశారు.

**దరఖాస్తు..! :** శుక్రవారం నాడు గాంధీ భవన్‌కు వచ్చిన బండ్ల.. మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మల్లారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మల్లారెడ్డికి మతిభ్రమించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల రక్తాన్ని పీల్చి.. మల్లారెడ్డి ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన చూసి కాంగ్రెస్ కార్యకర్తగా తాను గర్వపడుతున్నానన్నారు. మల్లారెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినా తీసుకోమన్నారు.

**గౌరవమేదీ మల్లన్నా..! :** 'డబ్బు ఉందనే అహంకారంతో మల్లారెడ్డి మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి అనే పదానికి గౌరవం ఇవ్వాలి. సీఎంను ఏకవచనంతో సంబోధిస్తున్నారు.. ఇది పద్ధతి కాదు. ఎంతమంది వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరు.. సీఎం రేవంత్ రెడ్డిని టచ్ కూడా చేయలేరు.

రోజుకు 20 గంటలు పనిచేస్తున్న ఏకైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే. రేవంత్ రెడ్డి పాలన చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. తెలంగాణ ఇచ్చి పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నాం.. అర్ధ రహిత ఆరోపణలు ఎప్పుడూ చేయలేదు.

ఇంద్రవెల్లి సభకోసం తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ రెండు నెలల రేవంత్ రెడ్డి పరిపాలన అద్భుతంగా ఉంది. రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ సీట్లు గెలుస్తుంది' అని బండ్ల గణేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి



భువనగిరి : భారాస భువనగిరి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం స్థానిక సాయి కన్వెన్షన్ హాలులో శుక్రవారం ప్రారంభమైంది.

ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి , జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బాల కృష్ణారెడ్డి రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటమితో కుంగిపోకుండా రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు.

# 9 నుంచి హైదరాబాద్ పుస్తక ప్రదర్శన.. ప్రాంగణానికి గద్దర్, వేదికకు రవ్వా శ్రీహరి పేర్లు




హైదరాబాద్ : సాహిత్యకారులు, పుస్తక ప్రియులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న పుస్తకాల జాతర మరో వారంలో ప్రారంభం కానుంది. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా ఈ నెల 9 నుంచి 19 వరకు 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు పుస్తక ప్రదర్శన పోస్టర్‌ను విడుదల చేశారు. పుస్తక ప్రదర్శన నిర్వహణకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ పుస్తకాల పండుగ ప్రాంగణానికి ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరును, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల వేదికకు ఆధునిక తెలుగు నిఘంటుకర్త ఆచార్య రవ్వా శ్రీహరి పేరు పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్, కార్యదర్శి ఆర్. శ్రీనివాస, సభ్యులు పాల్గొన్నారు.

# 'ఆరు చోట్ల బాంబులు పెట్టాం..': ముంబయికి బెదిరింపులు

ముంబయి: దేశ వాణిజ్య రాజధాని ముంబయికి మరోసారి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం ఉదయం ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. నగర వ్యాప్తంగా ఆరు ప్రదేశాల్లో బాంబులు పెట్టినట్లు ఆ వ్యక్తి బెదిరించాడు. దీంతో ముంబయి పోలీసులు, క్రైమ్ బ్రాంచ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు, ఫోన్ చేసిన వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. ట్రాఫిక్ పోలీస్ హెల్ప్‌లైన్‌కు చెందిన వాట్సప్ నంబరుకు ఈ కాల్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముంబయికి గతంలోనూ పలుమార్లు బాంబు బెదిరింపులు వచ్చాయి. నూతన సంవత్సర వేడుకల వేళ ఓ వ్యక్తి ముంబయి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి.. పలు



ప్రాంతాల్లో బాంబులు అమర్చినట్లు చెప్పారు. అంతకుముందు కూడా ఆర్‌బీఐ ఆఫీసులు సహా పలు బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. అయితే అవన్నీ నకిలీవేనని తేలింది.

# ఐదోసారీ డుమ్మా.. ఈడీ సమన్లను తిరస్కరించిన కేజ్రీవాల్

దిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ ల్యాండరింగ్ కేసు లో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి ఈడీ విచారణకు హాజరుకావడం లేదు. దర్యాప్తు సంస్థ ఇప్పటివరకు ఐదుసార్లు సమన్లు ఇవ్వగా.. ఆయన ఒక్కసారి కూడా విచారణకు వెళ్లలేదు. ఆయన్ను అరెస్టు చేసే ఉద్దేశంతోనే ఈడీ పదేపదే నోటీసులు ఇస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించింది. 'ఈ రోజు కూడా దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. ఈడీ విచారణకు హాజరుకావడం లేదు. మేం చట్టబద్ధమైన సమన్లకు కట్టుబడి ఉంటాం. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం, దిల్లీ ప్రభుత్వాన్ని కూల్చడమే ప్రధాని మోదీ లక్ష్యం. మేం అలా జరగనివ్వం' అని ఆప్ వెల్లడించింది.

**భాజపా కార్యాలయం వద్ద ఆప్ నిరసనలు..** చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో భాజపా మోసానికి పాల్పడిందంటూ శుక్రవారం ఆప్ నిరసన చేపట్టింది. దిల్లీలోని కమలం పార్టీ కార్యాలయం వద్ద ఆప్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ నిరసనల్లో కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ వ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. బస్సుల్లో వస్తోన్న తమ కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్నారని, తమ పార్టీ కార్యాలయం బయట పారామిలిటరీ బలగాలను మోహరించారని ఆప్ మంత్రి ఆతిశీ ఆరోపించారు. మేయర్ ఎన్నికల్లో జరిగిన మోసంపై తాము నిరసన చేస్తుంటే భాజపా ఎందుకు భయపడుతోందని విమర్శించారు. దీనిపై దిల్లీ సీఎం ఎక్స్(ట్విటర్ ) వేదికగా స్పందించారు. 'మొదట వారు చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఓట్లను దోచుకున్నారు. ఇప్పుడేమో శాంతియుతంగా నిరసన చేసేందుకు వస్తోన్న ప్రజలను అడ్డుకుంటున్నారు' అని దుయ్యబట్టారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com